


మన **జనప్రగతి**

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 సంచిక : 50 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 18 మార్చి 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




# మీా సాయం మాకక్కర లేదు..

**అమెరికా చాలా శక్తివంతమైన దేశం**

**హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం**

**మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక**

**వాషింగ్టన్,మన జనప్రగతి మార్చి 17:** హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

# రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

**మరో 15 రోజులకు అవసరమైన నిల్వలు**

**త్వరలోనే మరింత గ్యాస్ సరఫరా**

**కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ పెంచాలి**

**ప్రజలు పానిక్ కాకుండా చైతన్య పరచాలి**

**అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు సూచన**

**మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల**



**అమరావతి,మన జనప్రగతి మార్చి 17:**రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి మిగతా2లో...



# స్త్రీ శక్తి పథకం విజయవంతం స్ఫూర్తి

**దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు పథకం**

**నేడు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు**

**అమరావతి,మన జనప్రగతి మార్చి 17:**ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ తీసుకు వచ్చిన స్త్రీ శక్తి పథకం విజయవంతం కావడంతో దీనిని స్ఫూర్తిగా తీసుకున్న ప్రభుత్వం దివ్యాంగులకు కూడా పథకం అమలుకు ఆలోచన చేసింది. తాజాగా రాష్ట్రంలోని దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఈ పథకాన్ని బుధవారం.. మిగతా2లో...

# గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

**విలువలు,విశ్వసనీయత మీద పుట్టిన వైఎస్సార్‌సీపీ**

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కూటమి**

**మన పాలనలో క్యాలండర్ ప్రకారం హామీల అమలు**

**గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి**

**మనం మంచి చేశాం కనకనే ప్రతి ఇంట్లో పాలనపై చర్చ**

**ఇక మిగిలి ఉన్నది రెండేళ్లే...చివరి ఏడాది ఎన్నికలు**

**మధ్యలో నా పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం తెస్తా**

**మరింత పట్టుదలగా మనం ప్రజల్లోకి వెళ్లగలగాలి**

**ఒంగోలు పార్టీ కేడర్‌తో సమావేశంలో వైఎస్ జగన్**



**అమరావతి,మన జనప్రగతి మార్చి 17:**గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జగన్‌ది మాత్రమే కాదు.. వైఎస్సార్‌సీపీ అంతా కలిసి కట్టుగా నిర్మించుకున్నాం. వైఎస్సార్‌సీపీ విలువలు,విశ్వసనీయత మీద పుట్టింది. అదే పునాదుల మీద కొనసాగుతోంది. గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్.మనం మంచి చేశాం. కాబట్టే ప్రజలతో కలిసి ముందుకెళ్తున్నాం. మన పాలనకు, బాబు పాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించారు. ప్రతి ఇంట్లోనూ ఇదే చర్చ జరుగుతోందన్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కేడర్‌తో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. వైఎస్ జగన్ భేటీలో పార్టీ మిగతా2లో...

# ప్రభుత్వ పాఠశాలలో నాసిరకం భోజనం

**- ఆరోపణలు రావడంతో లోకేశ్ ఆకస్మిక తనిఖీ**


2లో

# అఫ్ఘానిస్థాన్‌లో పెను విషాదం

**కాబూల్ ఆస్పత్రిపై**

**పాక్ వైమానిక దాడి**

**దాడిలో 400 మంది**


**మృత్యువాత**

**మంటల్లో చిక్కుకున్న**

**ఆస్పత్రి భవనం**

**దాడి ఘటనను**

**తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం**



**కాబూల్,మన జనప్రగతి మార్చి 17:**అఫ్ఘానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ మిగతా2లో...

# వివేకా హత్యకేసును తప్పదారి పట్టించే యత్నం

**హత్యకేసు నిందితులతో మీడియా సమావేశాలా?**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్**



**అమరావతి,మన జనప్రగతి మార్చి 17:** మంత్రి వివేకా హత్య కేసులో నిందితులను కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. సొంత బాబాయ్ హత్య కేసులో నిందితులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం జగన్ దిగజారుడు తనానికి పరాకాష్ఠ అని విమర్శించారు. 'అబద్ధాల పునాదుల మీద పుట్టిన పార్టీ వైసీపీ.. బాబాయ్‌ను చంపింది ఎవరో తెలిసినా సాక్ష్యాలు చెరిపేయడమే మీ పనా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి, మిగతా2లో...

# లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

**- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్**



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 17:** తెలంగాణ లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆహుతులను స్వయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడికి విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవాని పరివార్ సభ్యులకు మరియు కళాకారులకు పేరు పేరున నాహృదయపూర్వక నమస్కారములు అని అన్నారు. మీా అందరికీ శ్రీ 'పరాభవ' నామసంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ నూతన సంవత్సరం మీా కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం.. పరాభవ అంటే.. మిగతా2లో...

# దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

**పితృత్వ సెలవులపైనా నిర్ణయం తీసుకోవాల్సిందే**

**పిల్లల పెంపకంలో తండ్రులకు కూడా భాగస్వామ్యం**

**ప్రసూతి సెలవుల విచారణలో సుప్రీం కీలక ఆదేశాలు**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 17:** ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే.. ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని తీర్పులో పేర్కొంది. ఆ బిడ్డ వయసుతో సంబంధం లేకుండా ఆ తల్లికి 12 వారాల సెలవు పొందడానికి అర్హత మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
18 -03-2026

# రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందుల్లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్ నుంచి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ప్యానిక్ అవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌లను పెంచేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంచి, మెరుగైన పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷ూష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్ఠంగా పెంచే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సమావేశానంతరం ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని పైరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 100 శాతం ప్రజలకు గ్యాస్ అందిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉండేవారని.. ఇప్పుడు వారు ఆరోగ్యశాఖ కిందకు మారినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉందని... వాటిని త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా ఉక్కుపాదం మోపుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.రాష్ట్రంలో గృహావసరాల కోసం ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటుగా 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 2.92 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి ఒక్కసారిగా ఎక్కువ బుకింగ్‌లు చేయడంతో సర్వర్లు జామ్ అవుతున్నాయని చెప్పారు. కేంద్ర నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాతే మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు అనుమతి ఉంటుందని గుర్తు చేశారు.బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఓటీపీ ద్వారా మాత్రమే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే 616 కేసులు నమోదు చేసి 2500 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు యాప్, ఫోన్ కాల్, వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని మంత్రి సూచించారు. ÷-రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, పార్లమెంటు ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. అవినీతి కోసం మాత్రమే వాళ్లు అధికారంలో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. మనం అధికారంలోకి వచ్చినప్పుడు అద్భుతమైన రాష్ట్రాన్ని ఇచ్చినట్లు బాబు బిల్డప్. వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసి అప్పగించారు. కేవలంలో ఖజానాలో రూ.100కోట్లు మాత్రమే ఉంచారు. తర్వాత కోవిడ్ లాంటి కష్టాలు ఎదుర్కొన్నాం. ఆర్థికంగా ఒత్తిళ్ల మధ్య మన పరిపాలన సాగింది. ప్రజలకు ఇచ్చిన మాటను ఎప్పుడూ వదిలి పెట్టలేదు. దేశ చరిత్రలో జరగని విధంగా హామీలు అమలు చేశాం. ముందుగానే క్యాలెండర్ ఇచ్చి హామీలను అమలు చేశాం. బడ్జెట్‌లో క్యాలెండర్ పెట్టి పథకాలు అమలు చేశాం. పేదలను, మధ్యతరగతి ప్రజలను ఆదుకున్నాం. మన హయాంలో రూ.3.31లక్షల కోట్లు అప్పు చేస్తే రూ.2.7లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో వేశాం. రెండేళ్లకే చంద్రబాబు కమిటెడ్ అప్పులు.. గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి. చంద్రబాబు హామీలు మోసాలుగా తేలిపాయా యని వైఎస్ జగన్ అన్నారు. 'మన పథకాలన్నీ చంద్రబాబు నాయుడు రద్దు చేశారు. ఈ డబ్బులన్నీ ఎవరి జేబులోకి వెళ్లిపోయాయి. జగన్ ఏం చేయగలిగాడు. బాబు ఎందుకు చేయలేక పోతున్నాడని చర్చిస్తున్నారు. అవినీతికి తావు లేకుండా మనం పథకాలు అమలు చేశాం. ఇప్పుడు దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇదే కొనసాగుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు. అమరావతి పనుల్లో తీవ్రమైన అవినీతి. భూములను శెనక్కాయలకు, బెల్లానికి ఇచ్చేస్తున్నారు. ఏపీలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డారు. పార్లమెంటు చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ ఆయనే. ఇలాంటి వాటిపట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరు దారుణం అన్నారు. చంద్రబాబు ఒక పాలకుడిగా వ్యవహరించడం లేదు. మోసం చేశారని బాధితురాలు సీఎంకు ఫిర్యాదు చేస్తే కమిటీలు వేస్తామంటున్నారు. ఆదిమూలం మహిళపై లైంగిక దాడి చేస్తే పంచాయతీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపల్‌పై వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై నో యాక్షన్. మహిళలకు అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్ అన్నారు. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీద నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీద కూడా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా నో యాక్షన్. ఆదినారాయణరెడ్డి కొడుకు డ్రగ్స్‌తో పట్టుబడితే నో యాక్షన్. తన కొడుకు స్విమ్మింగ్? పూల్స్? వద్ద తాగుతు, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తే నో యాక్షన్ అన్నారు. తన బావమరిది మహిళలపై నీచంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని బాబు అన్నారు. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు. చంద్రబాబుకు ఇక మిగిలింది రెండేళ్లే. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికలున్నాయి. మధ్యలో నా పాదయాత్ర కూడా ఉంటుంది. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట. కార్యకర్తల ద్వారానే ప్రజలకు మరింత మంచి' అని అన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు.

# అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియోలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷-గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని అఎ÷-గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు.

# వివేకా హత్యకేసును తప్పుదారి పట్టించే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుండెపోటు థియరీ నుంచి గొడ్డలి వేటు వరకు గంటకో మాట మార్చిన 'జగన్నాటకం' గూగుల్ టేకవుట్‌లో బట్టబయలైందని మంత్రి వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ వద్దని, నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడటానికి బాంబులతో బెదిరిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న వివేకా కన్నకూతురు సునీతమ్మపై అక్రమ సంబంధాల ముద్ర వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ కావాలన్నారు.. అధికారంలోకి వచ్చాక సీబీఐని తరిమికొట్టారు, ఇదేనా మీ నీతి' అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. త్య జరిగిన చోట రక్తపు మరకలను చెరిపేసి ఇంకో రకంగా చిత్రీకరించిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది అంటూ మంత్రి వ్యాఖ్యానించారు.

# దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని స్పష్టం చేసింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని వ్యాఖ్యానించింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్నబిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని పేర్కొంది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం.. 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఈ క్రమంలో పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది.

# మీ సాయం మాకక్కర లేదు..

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# స్త్రీ శక్తి పథకం విజయవంతం స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఉగాది పండగ కానుకగా సీఎం చంద్రబాబు నాయుడు మంగళగిరిలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొనున్నారు. ఈ పథకం ప్రారంభించిన తర్వాత.. దివ్యాంగులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్ తదితరులు ఆ బస్సులో ప్రయాణించనున్నారు. అనంతరం దివ్యాంగులకు సీఎం చంద్రబాబు ఆత్మీయ విందు ఇవ్వనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులతో కలిసి వారు ప్రయాణించనున్నారు. ఆ తర్వాత దివ్యాంగులతో కలిసి ప్రజా ప్రతినిధులు భోజనం చేయనున్నారు. రాష్ట్రంలోని 11.16 లక్షల మంది దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుకగా ఈ పథకాన్ని ప్రారంభించనుంది. ఈ దివ్యాంగ శక్తి పథకం ద్వారా 12.76 లక్షల మంది దివ్యాంగులతోపాటు వారి వెంట వచ్చే సహాయకులకు లబ్ది చేకూరనుంది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి 50 శాతం టిక్కెట్ రాయితీని ఈ పథకం ద్వారా కల్పించనుంది. 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు ఈ పథకం వర్తించనుంది. 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు ఈ 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రభుత్వం విస్తరించింది. ఈ పథకం అమలు కోసం ఏడాదికి రూ.207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. స్త్రీ శక్తి బస్సుల్లో దివ్యాంగులకు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇప్పటికే స్త్రీ శక్తి పథకం ద్వారా 52 కోట్లకు పైగా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.1,826 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చును భరిస్తుంది. డిసెంబర్ 3వ తేదీ దివ్యాంగుల దినోత్సవం. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్య పథకాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉగాది పండగకు ఒక రోజు ముందు దివ్యాంగ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది.

# ప్రభుత్వ పాఠశాలలో నాసిరకం భోజనం

**విజయవాడ,మన జనప్రగతి మార్చి 17:** మైలవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం భోజనం అంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో తారక రామానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంపై విద్యార్థులను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. 'భోజనం రోజూ బాగోవడం లేదా? ఆ ఒక్క రోజే బాగోలేదా?' అంటూ విద్యార్థులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. పాఠశాలలో భోజనం బాగుంటుందంటూ మంత్రికి బదులిచ్చారు విద్యార్థులు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆ తర్వాత సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం ఆయన సందర్శించారు. అందులోని చిన్న పిల్లలతో లోకేశ్ ముచ్చటించారు. ఆ తర్వాత పాఠశాల స్థితిగతులపై మైలవరం ఎంఈవో, హెడ్‌మాస్టర్‌తో లోకేశ్ మాట్లాడారు. ఆ క్రమంలో తనతో పాటు తెచ్చిన నివేదికపై ఎంఈఓతో లోకేశ్ చర్చించినట్లు తెలుస్తోంది. న్నతాధికారులు, పార్టీ శ్రేణులుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రి లోకేశ్ ఈ పాఠశాలను సందర్శించారు. లోకేశ్ పర్యటనపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కూ ఎలాంటి సమాచారం అందలేదని తెలుస్తోంది. మంత్రి లోకేశ్ రాకను తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు మైలవరానికి పరుగులు తీశారు.

# లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం అని గవర్నర్ శుక్లా ఆకాంక్షించారు. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఉగాది అంటేనే కొత్త శకం. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్ట సుఖాల కలయికను సూచిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.

# ఆస్తిపన్ను చెల్లింపుదారులకు శుభవార్త

## - వడ్డీలో 50శాతం రాయితీ కల్పించిన ఎపి ప్రభుత్వం

**అమరావతి,మన జనప్రగతి మార్చి 17:** మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఆస్తి పన్ను బకాయిలు పెరిగిపోయిన నేపథ్యంలో బకాయిల వసూలు కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీవో నెంబర్ 58ని విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 31 తేదీలోగా బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుంది. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించిన వారికి తదుపరి బిల్లులో ఆ మినహాయింపు మొత్తాన్ని సర్దుబాటు చేసి ఇస్తామని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు.

# వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి

● ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశాలు




**కర్నూలు మన జనప్రగతి మార్చి 17:-** జిల్లాలో కొనసాగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత,వడదెబ్బలు, అగ్నిప్రమాదాలు పెరిగే అవకాశమున్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, దేవాలయాలు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో త్రాగునీరు, చలివేంద్రాలు, నీడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు తగిన విశ్రాంతి, త్రాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని, మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు ఎండలో పని చేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు.అగ్నిప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా యంత్రాలు,సిబ్బంది అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అలాగే బావులు,చెరువులు, మైనింగ్ కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని తెలిపారు.వడదెబ్బలకు గురైన వారికి తక్షణ చికిత్స అందించేందుకు వైద్య శాఖ సిద్ధంగా ఉండాలని, ముఖ్య ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు.ప్రజలు తెల్లని దుస్తులు ధరించి, ఎక్కువగా నీరు, మజ్జిగ సేవిస్తూ ఎండ నుండి జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# చోరీల ముసురులో మాధవరం - భయంతో వణికుతున్న గ్రామం

● అర్ధరాత్రి దుకాణంలోకి చొరబడ్డ దుండగులు.

● రూ.1.45 లక్షల నగదు గల్లంతు.

● పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు.




**సిద్ధవటం మన జనప్రగతి మార్చి 17:-** మండలంలోని మాధవరం గ్రామంలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.రాత్రి వేళల్లో చోరీలు పెరుగుతుండటంతో గ్రామస్థులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.కొత్త మాధవరం 1, 2, 3 వార్డుల పరిధిలో నివాసముంటున్న సుధాకర్ అనే వ్యాపారి దుకాణంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు చొరబడి భారీ మొత్తంలో నగదును అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లగా,మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి.దుకాణంలో ఉన్న వ్యాపార నగదు రూ.25,000 భార్య సురేఖ పొదుపు రూ.40,000 బీరువాలోని మరో రూ.80,000..మొత్తంగా రూ.1.45 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు తోచుకెళ్లారన్నారు.అయితే ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ చోరీలు ఆగకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాత్రిపూట భద్రత పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై సిద్ధవటం ఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ..బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను అప్రమత్తం చేశారు.

# గ్యాస్ కొరతపై అపోహలు.. ప్రజలు ఆందోళన చెందవద్దు

**డొమెస్టిక్ సిలిండర్లకు ఎలాంటి సమస్య లేదు**

**అవసరం లేకుండా బుకింగులు పెంచవద్దు: డీలర్ సయ్యద్ బీ బాష**




**పోరుమామిళ్ల మన జనప్రగతి మార్చి 17:-** మండలంలో గృహావసరాలకు అవసరమైన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని ఇండియన్ గ్యాస్ డీలర్ సయ్యద్ బీ బాష తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ సిలిండర్ల సరఫరాపైనే పరిమితులు విధించిందని, గృహ వినియోగ సిలిండర్లపై ఎలాంటి ప్రభావం లేదని ఆమె స్పష్టం చేశారు.మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధ పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని, దీంతో ప్రజల్లో అనవసర భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. గ్యాస్ దొరకదేమో అన్న భయంతో అవసరం లేకపోయినా బుకింగులు పెంచడం వల్ల డీలర్ల వద్ద గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.గతంలో రోజుకు సుమారు 400 బుకింగులు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం అవి మూడింతలు పెరిగి 1000 నుంచి 1200 వరకు చేరాయని పేర్కొన్నారు. ఈ అధిక బుకింగుల కారణంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి మాత్రమే బుకింగ్ చేసేలా నియంత్రణలు అమలు చేస్తున్నదని చెప్పారు.బుకింగ్ చేసిన తర్వాత 24 గంటల్లో డీఎస్సీ నెంబర్ వస్తుందని, ఆ నెంబర్ ఆధారంగా ప్రతి ఒక్కరికీ గ్యాస్ డెలివరీ జరుగుతుందని వివరించారు. పోరుమామిళ్ల మండలంలో సుమారు 20 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, బుకింగ్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ సిలిండర్లు అందుతాయని భరోసా ఇచ్చారు.**ప్రజలకు విజ్ఞప్తి:** అవసరం ఉన్నప్పుడు మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని, ఫేక్ న్యూస్‌లను నమ్మి ఆందోళన చెందవద్దని సయ్యద్ బీ బాష సూచించారు.

# వెలిగల్లు ఘనత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డిదే : వైకాపా నాయకులు

**రామాపురం మండలంలో కూటమి ప్రభుత్వంపై విమర్శలు**



**రాయచోటి మన జనప్రగతి మార్చి 17:-** వెలిగల్లు ప్రాజెక్ట్ సాధనలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి దూరదృష్టి,మాజీ ఎమ్మెల్యేలు మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి కృషి కీలకమని రామాపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి ఆరోపణలను ఖండిస్తూ,అవి పూర్తిగా నిరాధారమని అన్నారు.రాయచోటి వంటి ఎడారి ప్రాంతాలకు త్రాగునీరు, సాగునీరు అందించి సస్యశ్యామలం చేసిన ఘనత వైఎస్సార్‌కే చెందుతుందని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ,కాలువల విస్తరణ వంటి చర్యలతో రైతులకు నీటి సదుపాయం కల్పించింది వైఎస్సార్ పాలననే అని గుర్తుచేశారు.మాజీ సీఎం జగన్ హయాంలో అభివృద్ధి మరింత వేగం పుంజుకుందని,జల జీవన్ మిషన్ కింద గ్రామాలకు త్రాగునీటి కోసం భారీ నిధులు మంజూరయ్యాయని చెప్పారు. గండికోట-కాలేటి వాగు ప్రాజెక్ట్ వంటి పనులు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.అదేవిధంగా,రాయచోటిని జిల్లా కేంద్రంగా మార్చడంలో శ్రీకాంత్ రెడ్డి కృషి ఎంతో కీలకమని, ఆ నిర్ణయంతో పట్టణ అభివృద్ధి వేగం పెరిగిందని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రజల ఆశలు దెబ్బతిన్నాయని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు చేపట్టలేదని, పేదలకు ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాయచోటి అభివృద్ధిలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాత్ర కీలకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అపోహలు నమ్మొద్దు




**పత్తికొండ మన జనప్రగతి మార్చి 17:-** పత్తికొండ లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై వస్తున్న అపోహలు, వదంతులను ప్రజలు నమ్మవద్దని స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత సూచించారు. ఈ వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైందని, ఎటువంటి తీవ్రమైన దుష్ప్రభావాలు ఉండవని ఆమె స్పష్టం చేశారు.భవిష్యత్తులో బాలికలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా రక్షణ కల్పించడంలో ఈ వ్యాక్సిన్ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. చిన్న వయసులోనే ఈ టీకా వేయించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చని పేర్కొన్నారు.ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న తప్పుడు ప్రచారాలను, అపోహలను ప్రజలు పక్కనపెట్టి, వైద్యుల సూచనలను మాత్రమే అనుసరించాలని ఆమె కోరారు. ఈ వ్యాక్సిన్ ఎంతో విలువైనదని, ముఖ్యంగా 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు తప్పనిసరిగా వేయించుకోవాలని ఆమె తెలిపారు.వ్యాక్సినేషన్ కార్యక్రమంలో దాదాపు 50 మంది బాలికలు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చి టీకా వేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సాయిబాబా,ప్రకాశ్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రతా లోపాల మధ్య పోస్ట్ ఆఫీస్‌లో చోరీ.. లక్షల్లో నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

● సీసీ కెమెరాలు లేకపోవడంపై విమర్శలు. ● బీరువా తలుపులు పగలగొట్టి చోరీ. ● అనుమానాస్పద కోణాల్లో పోలీసులు దర్యాప్తు




**పోరుమామిళ్ల మన జనప్రగతి మార్చి 17:-** స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో సోమవారం అర్ధరాత్రి సమయంలో దొంగతనం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం వెనుక భాగాన ఉన్న కిటికీ చువ్వలు విరిచి లోపలికి ప్రవేశించారు.అనంతరం బీరువా తలుపులు పగలగొట్టి అందులో ఉన్న రూ.2 లక్షల 87 వేల నగదును దోచుకెళ్లారు.మంగళవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన పోస్టల్ సిబ్బంది బీరువా పగిలి ఉండటాన్ని గమనించి భయాందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోరుమామిళ్ల సీఐ హేమసుందర్ రావు, ఎస్ఐ హనుమంతు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ ప్రారంభించారు.కేసును ఛేదించేందుకు క్లూస్ టీమ్‌ను కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. కాగా పోస్ట్ ఆఫీస్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతుండగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా నూకాలమ్మ ఆలయంలో ఏర్పాట్లు

**కాకినాడ, మన జనప్రగతి మార్చి 17:-** కాకినాడలోని పెద్ద మార్కెట్లో ఉన్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ చింతలపూడి రవికుమార్ మంగళ వారం ఆలయంలో తెలిపారు. బుధవారం జరిగే ఈ వేడుకలకు అమ్మవారు ఆలయం లో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం మురళీ వీరభద్రరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 4వ తేదీన వరకు జాతర ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం తెల్లవారుజాము నుండి అమ్మవారి దర్శనం కలుగుతుందని రాత్రి సిరి బొమ్మ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరిగి శనివారం అమ్మవారి దర్శన భాగ్యం జరుగుతుందని వీరభద్రరావు చెప్పారు.

# విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 17:-** విజిబుల్ పోలీసింగ్ తో ప్రజల భద్రతకు భరోసా కల్పించే విధంగావిజిబుల్ పోలీసింగ్ ను బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.జిల్లాలో ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూల్ ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ..నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు.వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటు న్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని,ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచిస్తున్నారు.రహదారి భద్రత నిబంధనలు తప్పక పాటించాలని,రహదారి భద్రతపై అవగాహన కల్పిం చడం, ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు.రహదారి భద్రత నియమాల ఉల్లంఘనల చేసిన వారిపై చర్యలు తప్పవు అని,మైనర్ డ్రైవింగ్ చేయకూడదని,సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకు ంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే,ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే స్థానిక పోలీసులకు గాని,డయల్ 112 కు గాని లేదా డయల్ 100 గాని సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

# లింగాల మండలంలో విషాదం

● టిప్పర్ కిందపడి వ్యక్తి మృతి ● రివర్స్ వస్తున్న టిప్పర్ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే దుర్మరణం



**లింగాల మన జనప్రగతి మార్చి 17:** లింగాల మండలం బోనాల గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో దస్తగిరి (40) అనే వ్యక్తి మృతి చెందాడు.మట్టి తోలుతున్న టిప్పర్ అజాగ్రత్తగా రివర్స్ తీయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు మరియు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బోనాల గ్రామంలో భారీ ప్రోక్లైన్ (ఎక్స్‌కవేటర్) సాయంతో మట్టిని టిప్పర్లలో నింపుతున్నారు.ఈ క్రమంలో దస్తగిరి ప్రోక్లైన్ వద్ద ఉండి మట్టి పోయిస్తుండగా,మరొక టిప్పర్ మట్టి కోసం రివర్స్‌లో వచ్చింది. వెనుక నుంచి వస్తున్న టిప్పర్‌ను దస్తగిరి గమనించలేదు,అటు డ్రైవర్ కూడా వెనుక దస్తగిరి ఉన్నాడనే విషయాన్ని గుర్తించలేదు.దీంతో టిప్పర్ వెనుక చక్రాలు దస్తగిరిపై నుంచి బలంగా దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు దస్తగిరి మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు పోలీసులకు అధికారికంగా ఎటువంటి సమాచారం అందలేదు.ఈ ప్రమాదానికి గల పూర్తి వివరాలు,ఇతర కారణాలు తెలియాల్సి ఉంది. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో మృతుని కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# పులివెందుల మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్‌కు వినతి

**- చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ఆధ్వర్యంలో**

**మంత్రిని కలిసిన ప్రతినిధుల బృందం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 17:** పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి మరియు ఆధునీకరణపై రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ మర్యాద పూర్వకంగా సమా వేశమయ్యారు. అమరావతిలో జరిగిన ఈ భేటీలో యార్డ్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ మంత్రికి ఒక వినతిపత్రాన్ని అందజేశారు. యార్డుకు వచ్చే రైతులకు అవసరమైన తాగునీరు, విశ్రాంతి గదులు మరియు ఇతర కనీస సౌకర్యాలను మెరుగుపరచాలని,మార్కెట్ యార్డును ఆధునీకరించి, రైతులకు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలన్నారు.రైతులకు మేలు చేకూర్చే విధంగా యార్డ్ కార్యకలాపాలను విస్తరించాలని కోరారు.చైర్మన్ విన్నపాన్ని సావధానంగా విన్న మంత్రి నారా లోకేష్ దీనిపై సానుకూలంగా స్పందించారు.రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. పులివెందుల మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాంఅని త్వరలోనే దీనికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటాం అని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.మంత్రి హామీ పట్ల చైర్మన్ అమర్నాథ్ యాదవ్ మరియు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ఈనెల 19వ తేదీ గురువారమే ఉగాది పండుగ

**- ప్రముఖ పురోహితులు రామ్ కుమార్ శర్మ స్పష్టీకరణ**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 17:** హిందువులు అత్యంత వైభవంగా జరుపుకునే 'ఉగాది' పండుగ తేదీ విషయంలో ప్రజల్లో నెలకొన్న సందిగ్ధతపై ప్రముఖ పురోహితులు, జ్యోతిష్య పంచాంగ పరిశీలకులు మరియు జిల్లా పురోహిత సంఘ గౌరవ సలహాదారులు పులివెందుల రామ్ కుమార్ శర్మ స్పష్టతనిచ్చారు.సామాజిక మాధ్యమాల్లో వస్తున్న రకరకాల వార్తల నేపథ్యంలో ఆయన శాస్త్రోక్తంగా వివరణ ఇచ్చారు.రామ్ కుమార్ శర్మ వివరణ ప్రకారం తిథి గమనం మార్చి19(గురువారం) ఉదయం7:05నిమిషాల వరకు అమావాస్య ఉందని ఆ తర్వాత 'పాడ్యమి' తిథి ప్రారంభమవుతుందని,మార్చి 20 (శుక్రవారం) తెల్లవారుజామున సూర్యోదయానికి పూర్వమే,అంటే 5:55 నిమిషాలకే పాడ్యమి ముగుస్తుందని, మన ప్రాంతంలో మార్చి 20న సూర్యోదయం6:12 నిమిషాలకు జరుగుతుంది,అంటే సూర్యోదయ సమయానికి అక్కడ 'విదియ' తిథి ఉంటుంది కాబట్టి శాస్త్రం ప్రకారం సూర్యోదయానికి పాడ్యమి తిథి ఉండాలి కానీ మార్చి 20వ తేదీ సూర్యోదయానికి పాడ్యమి లేనందున,అంతకు ముందు రోజైన మార్చి 19వ తేదీ గురువారమే ఉగాది పండుగను ఆచరించడం శుభప్రదమని ఆయన తెలిపారు.

# ఆదిత్య బిర్లాలో మొక్కలు నాటే కార్యక్రమం







**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ప్రగతి మార్చి 17:-** ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టూ వాలంటీర్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన ఆదిత్య బిర్లా లో మొక్కలు నాటడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ మరియు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.శ్రీనిత, ఎన్. శ్రీనివాసులు రెడ్డి,జోష్ణ,వాలంటీర్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గుంటలను తీసి వరుస క్రమాల్లో 200 మొక్కలు నాటడం జరిగినది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి మన భూమాతను కాపాడుకోవాలని,పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని అన్నారు.ఈ మొక్కల వలన పర్యావరణ పరిరక్షణ,భూసారం పెరగటం,స్వచ్ఛమైన గాలి,వాతావరణ సమతుల్యత,లైఫ్ లాంగ్ ఆక్సిజన్ అందించబడటం జరుగుతుంది.ఆదిత్య బిర్లా మేనేజర్ వాలంటీర్లను అభినందించారు.

# వడదెబ్బపై ప్రజలకు అవగాహన కార్యక్రమం



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 17:-** బొమ్మనహాల్ మండల కేంద్రంలోని వడ్డే కాలనీలో మరియు గోవిందవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. చల్లా శ్రీలక్ష్మి,ఎంపిహెచ్ఈఓ,లక్ష్మీ నాయక్ తన సిబ్బందితో కలిసి వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటల లోపే బయట పనులు ముగించుకోవాలన్నారు,ఎండలో తిరగకూడదని ఎండ తీవ్రత వల్ల శరీరంలోని నీరు లవణాలు చెమట రూపంలో తగ్గి అపస్మారక స్థితి, ప్రాణాపాయం కలగవచ్చని తెలిపారు.ముఖ్యంగా ఎక్కువగా నీరు,ద్రవ పదార్థాలు తీసుకోవాలని వడదెబ్బ సోకిన వ్యక్తిని ముందుగా నీడలోకి తీసుకెళ్లి,బట్టలు వదులుగా చేసి తడి గుడ్డతో శరీరాన్ని చల్లబరచాలని సూచించారు,బయట ఎండలో తిరిగేవారు తెల్లని దుస్తులు,టోపీ, టావాలు వాడాలని,కాచిన నీటినే తాగాలని చెప్పారు.ఈ కాలంలో డయేరియా అతిసార వ్యాధులు వచ్చే అవకాశముండడంతో ఓఆర్ఎస్ ద్రావణం వినియోగంపై వివరించారు.ఒక లీటర్ కాచిన నీటిలో ఓఆర్ఎస్ పొట్లం కలిపి 24 గంటలలోపే వాడాలని,లేకపోతే ఇంట్లోనే ఉప్పు,పంచదార కలిపి ద్రావణం తయారు చేసుకోవచ్చని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్,ఈశ్వరయ్య,హెల్త్ సూపర్వైజర్ రుక్మిణి,ఏఎన్ఎం భాగ్యశ్రీ,ఆశ కార్యకర్తలు రంగావెని, మధులత,శివగంగమ్మ,పాల్గొన్నారు.

# పియర్ గ్రూప్ లెర్నింగ్‌తో విద్యార్థినుల ప్రతిభ ప్రదర్శన



**కడప మన జనప్రగతి మార్చి 17:-**కడప నగరంలోని కోటి రెడ్డి ప్రభుత్వ మహిళా స్వయంప్రతిపత్తి కళాశాలలో మంగళవారం నిర్వహించిన 'పియర్ గ్రూప్ లెర్నింగ్' కార్యక్రమం విద్యార్థినుల సృజనాత్మకత,బోధనా నైపుణ్యాలకు అద్దం పట్టింది. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో న్యాక్ ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థి కేంద్రీకృత బోధన,ఐసిటి ఆధారిత విద్యా విధానాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ఎస్.కరిష్మా, కె.దీపికలు అధ్యాపకులుగా మారి,ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠాలు బోధించారు.టేకు మొక్క నిర్మాణం,ఎర్రచందనం అంతర్నిర్మాణం,వాటి లక్షణాలు,పర్యావరణ ప్రాముఖ్యత, అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న వాణిజ్య విలువలపై సమగ్రంగా వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలతో కూడిన సమాచారం అందించడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...ఇటువంటి అభ్యాస పద్ధతులు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు స్టేజ్ ఫోబియాను తగ్గిస్తాయని తెలిపారు.విద్యార్థినులే బోధించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, విశ్లేషణా సామర్థ్యం, క్లాస్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని వివరించారు. సీనియర్-జూనియర్ విద్యార్థినుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడటానికి కూడా ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మార్చి 17:-** ఉపాధ్యాయుల బోధనలో నూతనత్వం అవసరమని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రాయచోటి డైట్‌లో "విద్యా బోధనలో నూతన పద్ధతులు తరగతుల్లో సమర్థవంతంగా అమలు" అనే అంశంపై ఉపాధ్యాయులకు చర్చాగోష్టి (సెమినార్) నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సంప్రదాయ బోధన విధానాలతో పాటు అనుభవాత్మక, ఆసక్తికర బోధన పద్ధతులను ఉపాధ్యాయులు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తి పెంపొందించడానికి నూతన బోధన విధానాలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. రాయచోటి డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు తమ ఉత్తమ బోధనా అనుభవాలను పంచుకునే వేదికగా ఈ సెమినార్ ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ గిరిబాబు యాదవ్,అధ్యాపకులు వైసీ రెడ్డప్ప రెడ్డి, కేదార్నాథ్, వెంకట సుబ్బారెడ్డి, శివప్రసాద్, యుగంధర్, నిర్మల,శివ భాస్కర్,ఉషా మాధురి,మార్ల ఓబుల్ రెడ్డి, రాయచోటి డివిజన్ పరిధిలోని ఆంగ్లం, గణితం,భౌతిక శాస్త్రం,జీవశాస్త్రం,సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 44వ డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా పనిచేశాం: వెళ్లాల హేమలత,రామకృష్ణారెడ్డి



**కడప మన జనప్రగతి మార్చి 17:-** 44వ డివిజన్‌లో ప్రజల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా గత ఐదు సంవత్సరాలుగా సేవలందించామని కార్పొరేటర్ వెళ్లాల హేమలత, వెళ్లాల రామకృష్ణారెడ్డి తెలిపారు.తమ పదవీకాలం పూర్తయిన సందర్భంగా వారు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..డివిజన్ ప్రజలు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులు అందించిన సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. తమపై ఉంచిన నమ్మకానికి ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.తమ పదవీకాలంలో రెండు పార్కుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం,దేవాలయాలకు నిధుల మంజూరు,బుగ్గ వంక బ్రిడ్జిల వద్ద చెత్త వేయకుండా కంచెల ఏర్పాటు, నబికోటలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. కాగితాలపెంట మసీదు వద్ద సీసీ రోడ్ ఏర్పాటు, ఐటీఐ సర్కిల్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణం, చౌడమ్మ సర్కిల్ వద్ద బెంచీలు ఏర్పాటు, స్మశాన వాటిక అభివృద్ధి వంటి పనులు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు.అలాగే 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా పాఠశాల అభివృద్ధికి కృషి చేశామని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా పనిచేశామని పేర్కొన్నారు. పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజలకు సేవ చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.డివిజన్ అభివృద్ధికి సహకరించిన మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం ఆమ్జాద్ భాషా, ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీందర్ రెడ్డి, ఇతర కార్పొరేటర్లు మరియు ప్రజలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి.. గ్రామంలో విషాదఛాయలు



**పోరుమామిళ్ల/కలసపాడు మన జనప్రగతి మార్చి 17:-**కలసపాడు మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన రామిరెడ్డి గారి పాలకొలను వెంకటరెడ్డి మంగళవారం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.మృతుడికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఆయన భార్య నారాయణమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమాచారం.కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.వెంకటరెడ్డి మృతితో కొండపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.కుటుంబ సభ్యులు,బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# చెన్నూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి**



**చెన్నూరు మన జనప్రగతి మార్చి 17:-** చెన్నూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి,వండిన పదార్థాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సమిష్టి భోజనం చేశారు.ప్రతిరోజు అందుతున్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.మండలంలోని పాఠశాలలకు భోజనం అందించేందుకు కొండపేటలో నిర్మాణంలో ఉన్న సెంట్రల్ స్మార్ట్ కిచెన్ భవనం పురోగతిపై మండల విద్యాశాఖ అధికారులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల అనేక మంది విద్యార్థులకు విద్యాబోధన చేసిన ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అని పేర్కొన్నారు.ఇక్కడ చదివిన వారు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తుచేశారు.పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి,ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బరాజు, ఉపాధ్యాయులు,సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచ వీక్షణగా వైవియూ వెబ్సైట్... మీడియా కార్నర్ ప్రారంభించిన వైవియూ వీసీ ఆచార్య బెల్లంకొండ



**కడప మన జనప్రగతి మార్చి 17:-**కడపయోగివేమన విశ్వవిద్యాలయం వెబ్సైట్ ను ప్రపంచం వీక్షిస్తుందని అందుకు తగ్గట్టుగా రూపకల్పన జరగాలని యోగివేమన విద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు.ఉపకులపతి విశ్వవిద్యాలయంలోని తన చాంబర్లో వెబ్సైట్లోని మీడియా కార్నర్ ను కుల సచివులు ఆచార్య పి పద్మ, ఐటీ సెల్ డైరెక్టర్ తుమ్మలకుంట శివ, మీడియా కార్నర్ బాధ్యులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు,కంప్యూటర్ ఆపరేటర్ రఖీబ్ తో కలసి మంగళవారంప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి విశ్వవిద్యాలయం సులువుగా చేరువయ్యేలా చూడాలన్నారు.విశ్వవిద్యాలయ వెబ్సైట్ లో ఆధునీకరించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. పబ్లిక్ కి ఏది అవసరమో అది వెబ్సైట్లో కనిపించాలన్నారు. మీడియా కార్నెర్ లో ఎప్పటికప్పుడు అప్డేట్ ఇన్ఫర్మేషన్ ఉండాలని,ఈవెంట్స్ కూడా అందుబాటులో ఉంచాలని డా.సురేష్ కు సూచించారు.ఐటీ సెల్ డైరెక్టర్ తుమ్మలకుంట శివ వెబ్సైట్లో పొందు పరచిన అంశాలను, చేర్చబోయే విభాగాల గురించి వివరించారు.

# కైజిన్ - 2కె26లో విజేతలకు ప్రశంసలు



**కడప మన జనప్రగతి మార్చి 17:-**నంద్యాలలోని ఆర్జీఎం కాలేజిలో కైజిన్ - 2కె26 పేరుతో నిర్వహించిన మేనేజ్మెంట్ మీట్ లో యోగివేమన విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విభాగ విద్యార్థులు ప్రతిభను చాటి బహుమతులు అందుకున్నారని అ శాఖ విభాగ అధిపతి డాక్టర్ పి సరిత మంగళవారం తెలిపారు.అమీట్లో విజేతలుగా నిలిచిన వారిని ఆమె అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...యంగ్ మేనేజర్ ఈవెంట్లో పి.గురుబాయి,జి.వైష్ణవి,బి.రూపాదేవి,కె.పూర్ణను (క్రోన్ క్యాటలెస్టా నగదు బహుమతి పొందారని చెప్పారు.పేపర్ ప్రెజెంటేషన్ లో పి.శ్వేత,యస్ చరిత,రెండవ స్థానంలో నిలిచి నగదు బహుమతి అందుకున్నారన్నారు.బజ్ స్పార్క్ పోటిలో బి.నందిని,ఎం. వినోద్ కుమార్,డి.విక్రాంత్, ఎ. చైతన్య తృతీయ స్థానంలో నిలిచి వారి ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెతికితీసె వేదికగా నిలిచిందని ప్రతిభవంతుల అభిప్రాయం వ్యక్తం చేశారు.మేనేజ్మెంట్ శాఖలోని అధ్యాపకులు విద్యార్థులను ప్రశంసించారు.

# డ్రైవర్ రాజేష్ కుటుంబానికి అండగా సేఫ్టీ యూనియన్ డ్రైవర్ అసోసియేషన్

- **తోటి డ్రైవర్ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం**
- **చిన్నారి సంజన నుంచి రూ.500 విరాళం..మానవత్వానికి నిదర్శనం**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 17:-** కష్టాల్లో ఉన్న తోటి డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవడంలో సేఫ్టీ యూనియన్ డ్రైవర్ అసోసియేషన్ మానవత్వాన్ని చాటుకుంది. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ రాజేష్ ఇటీవల మృతి చెందడంతో,ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ నేపథ్యంలో అసోసియేషన్ సభ్యులు,దాతల సహకారంతో సేకరించిన రూ.10,000 నగదును రాజేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.అలాగే రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేసి,కుటుంబానికి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో చిన్నారి సంజన చూపిన ఉదారత అందరినీ కదిలించింది.కమలాపురం ఇంచార్జ్ వీరాంజనేయులు కుమార్తె,మూడవ తరగతి చదువుతున్న సంజన,తన పుట్టినరోజు సందర్భంగా దాచుకున్న కిడ్డీ బ్యాంకును తెరిచి అందులోని రూ.500లను రాజేష్ కుటుంబానికి విరాళంగా అందించింది.ఆమె చిన్న వయసులో చూపిన పెద్ద మనసును అందరూ ప్రశంసిస్తున్నారు.ఈ సేవా కార్యక్రమంలో సేఫ్టీ యూనియన్ డ్రైవర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి నూర్ మొహమ్మద్,జిల్లా కార్యదర్శి సూరిబాబు,జిల్లా ఇంచార్జ్ దండు రాజేష్,పులివెందుల అధ్యక్షుడు జయరామిరెడ్డి, మైదుకూరు టౌన్ అధ్యక్షుడు గురివిరెడ్డి,టౌన్ ఇంచార్జ్ రవిశంకర్ రెడ్డి,కమలాపురం ఇంచార్జ్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.తోటి కార్మికుడి కష్టాన్ని తమ కష్టంగా భావించి సహాయం చేసిన అసోసియేషన్ సభ్యులను స్థానికులు అభినందిస్తున్నారు.

## నగరపాలక సంస్థకు తక్షణమే నిధులను విడుదల చేసే ఆదుకోవాలి: నగర మేయర్ పాక సురేష్ కుమార్



**కడప మన జనప్రగతి మార్చి 17:-** ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన నగర పాలక సంస్థకు తక్షణమే నిధులను విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నానని నగర మేయర్ పాకా సురేష్‌కుమార్ తెలిపారు.కడప నగర పాలక సంస్థలోని తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న 17కోట్ల ప్రభుత్వ బకాయి కోసం సీఎం చంద్రబాబుకు లేఖ రాశానని, ప్రభుత్వం స్పందించకపోవడంతోనే హక్కుగా రావాల్సిన నిధుల కోసం న్యాయ పోరాటానికి దిగామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవాల్సిన బాధ్యత పాలక ప్రతిపతిపక్ష పార్టీలకు ఉందన్నారు. పన్నులను పెంచిన కారణంగా పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇష్టానుసారంగా తప్పుల తడకగా మాస్టర్ ప్లాన్ చేశారన్నారు. నేటితో మూడవ పాలక వర్గం ముగిసిందన్నారు.మేయర్ ఎన్నిక అనివార్యం కావడంతో నన్ను ఎన్నుకోగా, ప్రజా సమస్యలపై పోరాటం చేశానన్నారు.తన వంద రోజుల్లో మార్నింగ్ విజిట్ తో ప్రజల ముంగిటకు వెళ్లామని,గుంతలమయమైన రోడ్డును మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చామన్నారు.సాగర్ కాలనీలో ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని కాపాడి ప్రకాష్ నగర్ లో పెండింగ్ లో ఉన్న కాల్వ పనులను చేపట్టడం జరిగిందన్నారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఆలంఖాన్‌పల్లె కాల్వ పనులను ఎన్ క్యాబ్ నిధులతో చేపట్టామన్నారు.రీ టెండర్లు ద్వార అనేకమైన సమస్యలను పరిష్కరించడంతోపాటు నగరంలోని ఎకో పార్క్ ను శ్రమదానంతో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. అయితే మోడల్ మార్కెట్ చేయాలన్న ఆశయం నెరవేరలేదన్నారు.మతాలకు సంబందించిన కార్యక్రమాలకు పాలక వర్గం సహకరించడం జరిగిందన్నారు. అదనపు వర్కర్లకు 15వేలకు వేతనాన్ని పెంచడంతోపాటు పోస్టల్ భీమా సంస్థతో మాట్లాడి కార్మిక వర్గానికి భీమా చేయించడం తమకు సంతృప్తి నిచ్చిందని పేర్కొన్నారు.అందరి సహకారంతో ప్రజలకు తనవంతుగా సేవలు అందించగలిగానని మేయర్ తెలియజేశారు.

## హెచ్.పి.వి టీకాను 14 నుండి 15 ఏళ్ల బాలికలు వేయించుకోవాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి మన జన ప్రగతి మార్చి 17:-** కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. అందులో భాగంగా గత నెల 28 నుండి బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా 14 నుండి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ప్రతి బాలికకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా హెచ్.పి.వి టీకాను అందజేస్తుంది.ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కేంద్ర ప్రభుత్వానికి, మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు తెలుపుతూ శేరిలింగంపల్లి బీజేపీ ఆధ్వర్యంలో కొండాపూర్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై పాలభిషేకం చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాలికలకు ,మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుంది.బాలికలకు కూడా సుకన్య సమృద్ధి యోజన, భేటీ బచావో, భేటీ పడవో, ఉడాన్ స్కాలర్ షిప్ స్కీమ్, ఇవే కాక మహిళలకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన,పీఎం మాతృ వందన యోజన, ముద్ర యోజన, స్టాండ్ అప్ ఇండియా నుండి లోన్లు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలియజేశారు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడేందుకు 14 నుండి 15 ఏళ్ల లోపు ఉన్న బాలికలకు ఫిబ్రవరి నుండి ఒక డోస్ కు 4000 ఖర్చు అయ్యే హెచ్ పి వి టీకాలు ఉచితంగా అందజేస్తుందని, మన తెలంగాణ లో 3,50,000 మందికి ఈ హెచ్ పి వి టీకాలు పంపిణీ చేయాలనే లక్ష్యంగా ప్రారంభించగా,మొదటి దశలో 1,45,000 వేల టీకాలు పంపిణీ చేస్తున్నారని, చాలా మందికి సరైన అవగాహన లేక చాలా తక్కువ సంఖ్యలో టీకా వేయించుకుంటున్నారని, మన శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 14 నుండి 15 ఏళ్ల లోపు ఉన్న ప్రతి బాలికకు వాళ్ళ తల్లిదండ్రులు కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందజేస్తున్న ఈ హెచ్.పి.వి టీకాను వేయించుకుని ఇలాంటి గొప్ప అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు.సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి,ఆంజనేయులు సాగర్,మహేష్ యాదవ్,జితేందర్,రమేష్,గోపాల్ రావు,రామ్ రెడ్డి,ఓబుల్ రెడ్డి, గణేష్ ముదిరాజ్,లక్ష్మణ్,రవి,విష్ణు దత్తు,పద్మ, మేరీ,విజయలక్ష్మి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో గ్యాస్‌కు కొరతలేదు

- గ్యాస్ ఏజెన్సీలను పర్యవేక్షించిన బిజెపి నాయకులు




**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 17 :-** ప్రొద్దుటూరు మరియు పరిసర ప్రాంతాలలో గ్యాస్ కు కొరత లేదని గ్యాస్ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని బిజెపి పట్టణ అధ్యక్షులు నరేంద్ర రావు స్పష్టం చేశారు మంగళవారం ఆయన పట్టణంలోని పలు గ్యాస్ ఏజెన్సీలను సందర్శించి నిలువలు మరియు పంపిణీ తీరును పర్యవేక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన కాలంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందన్నారు అపోహలతో వినియోగదారులు ఒకేసారి గ్యాస్ బుకింగ్ లు చేసుకోవడంతో గ్యాస్ సిరివెన్నెల పంపిణీ కొంతమేరకు ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమన్నారు. దీనివల్ల నిజంగా గ్యాస్ అవసరం ఉన్న సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్య క్తులు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రజలు ఎలాంటి అపోహ పడవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంబగిరి ఓబీసీ మోర్చా అధ్యక్షులు తుపాకులు చౌడయ్య గోసంరక్షణ అధ్యక్షులు శివనాగిరెడ్డి పట్టణ కార్యదర్శులు హరికృష్ణ, మురళీమోహన్ సీనియర్ నాయకులు చలపతిరావు ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లయ్య మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైబ్ డిజైనింగ్‌లో రాణిస్తున్న ఆర్జీయూకేటీ విద్యార్థులు




**వేంపల్లె మన జనప్రగతి మార్చి 17:-**వైబ్ డిజైనింగ్ లో ఆర్జీయూకేటీ విద్యార్థులు రాణిస్తున్నారు. ఈసీఈ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి సాయినాథ్ రెడ్డి ఆధునిక వైబ్ సైట్ ను రూపొందించాడు. వైబ్ సైట్ ను స్వర్గధామం పేరుతో ప్రారంభించాడు. సేవలను కాలానుగుణంగా ప్రజల ముందుకు తీసుకువచ్చే దిశగా రూపొందించిన స్వర్గధామం అనే ఆధునిక వైబ్ సెట్ ను మంగళవారం నంద్యాలలో సొల్యూషన్స్ స్పాట్ సంస్థ అవిష్కరించడం జరిగింది. స్వర్గధామం వంటి సేవా సంస్థకు టెక్నాలజీ రూపంలో ప్రాణం పోసిన ఈ యువ విద్యార్థి పనితనం అందరిని ఆకట్టుకుంది.ఆధునిక డిజైన్, వేగవంతమైన పనితీరు, వినియోగదారులకు సులభమైన అనుభవం అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ వైబ్ సైట్ ను రూపొందించినట్లు విద్యార్థి సాయి నాథ్ రెడ్డి తెలిపారు.చిన్న వయస్సులోనే టెక్నాలజీ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, సామాజిక అవసరాలకు అనుగుణంగా డిజిటల్ పరిష్కారాలను అందించడంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. అంచనాలకు మించి, సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను సొల్యూషన్ స్పాట్ అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో గౌసియా, లహరి,మణికుమార్ వంటి యువ ఇంజనీర్లు సేవా దృక్పథంతో పని చేసి వెబ్‌సైట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యార్థి సాయి నాథ్ రెడ్డి తెలిపారు.సొల్యూషన్ స్పాట్ సంస్థ ఆర్కేవ్యాలీ విద్యార్థి సాయినాథ్ రెడ్డి నాయకత్వంలో టెక్నాలజీని సామాజిక సేవతో కలిపి ఒక కొత్త ప్రమాణాన్ని సృష్టించి స్వర్గధామం వెబ్‌సైట్ ను ఆవిష్కరణ బలమైన ఆరంభంగా నిలిచిందని ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.

## లక్ష్యాన్ని అధిగమించిన సింహాద్రిపురం మార్కెట్ కమిటి

- నాలుగేళ్ళలో తొలిసారి లక్ష్య సాధన
- సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బండి రామసూరా రెడ్డి



**సింహాద్రిపురం మన జనప్రగతి మార్చి 17:** పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇంచార్జి,మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి (బి.టెక్ రవి)సూచనలతో సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ కమిటి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించినట్లు మార్కెట్ కమిటి చైర్మన్ బండి రామసూరా రెడ్డి తెలిపారు. సింహాద్రిపురం లోని వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయం లో మంగళవారం ఆయన పత్రికా విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ కమిటికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ రుసుము రూ.24.00 లక్షలు లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెట్ రుసుము మంగళవారం నాటికి రూ.24.15లక్షలు సాధించినట్లు తెలిపారు. సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ కమిటి ఏర్పడి ఇప్పటికి నాలుగేళ్ళు అయిందని,కూటమి ప్రభుత్వ హయాంలోనే మొదటి సారి లక్ష్యాన్ని సాధించినట్లు చైర్మన్ బండి రామసూరా రెడ్డి తెలిపారు.లక్ష్యసాధనకు కృషి చేసిన ఉద్యోగులు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను చైర్మన్ అభినందించారు.ఈ కార్యక్రమం లో సహాయ కార్యదర్శి వి.శ్రీధర్ రెడ్డి, పర్యవేక్షకులు సి.హర్ష వర్ధన్ రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: చమర్తి జగన్ మోహన్ రాజు





**రాజంపేట మన జనప్రగతి మార్చి 17:-**రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు.మంగళవారం ఒంటిమిట్ట మండలం గొల్లపల్లె, దర్జీపల్లె గ్రామాల్లో నిర్వహించిన “అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రైతన్న మీకోసం - ఇంటింటికి” కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల ఇళ్లకు వెళ్లి పథకాల ద్వారా అందుతున్న నిధులపై వివరాలు తెలుసుకున్నారు.రైతులు పొందుతున్న లబ్ధిపై అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు, వ్యవసాయ పనులపై కూడా ఆరా తీశారు. అనంతరం పొలాల్లో పనిచేస్తున్న రైతులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైల్వే కోడూరులో ఘనంగా దైవ సేవకుల ఐక్య సదస్సు

ముఖ్య అతిథిగా దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 17:-**రైల్వే కోడూరు పరిధిలోని బొజ్జవారిపల్లి ఇమ్మానియేల్ రక్షణ స్వస్థతశాల మందిరంలో మంగళవారం దైవ సేవకుల ఐక్య సదస్సు అత్యంత వైభవంగా నిర్వహించబడింది. యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ (యు.సి.పి.ఐ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్లు నల్ల కదిరి గాళ్ల మరియు శాంతయ్య కన్వీనర్లుగా వ్యవహరించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు,మదర్ థెరిసా హ్యూమానిటీ అవార్డు గ్రహీత డాక్టర్ కోలా ప్రసాద్‌కు బొజ్జవారిపల్లి వాటర్ ట్యాంక్ వద్ద భారీ జనసమూహం, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు.అక్కడి నుండి చర్చి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కోలా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి, వారికి రక్షణగా నిలవడానికి యుసిపిఐ సంస్థ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశంలో మతోన్మాద శక్తులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని,క్రైస్తవులందరూ ఐకమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమ నిర్వాహకులు శాంతయ్య మాట్లాడుతూ, క్రైస్తవం అనేది ఒక మతం కాదు,అదొక జీవన మార్గమని పేర్కొన్నారు.దళితులపై గానీ, క్రైస్తవులపై గానీ ఎక్కడ దాడులు జరిగినా యూసిపిఐ బాధితుల పక్షాన నిలబడి, నిందితులకు కఠిన శిక్ష పడేలా పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ సదస్సులో మదనపల్లి బిషప్ సుందర్ సింగ్,యుసిపిఐసి కమిటీ సభ్యులు పాస్టర్ ప్రశాంత్, కృపా రాజు,డేవిడ్ రాజు, దేవరాజుతో పాటు పాస్టర్లు చంద్రపాల్,లూకా,ఉదయ్, జకర్యయ్య,కిరణ్,సత్యం సర్దార్, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.అలాగే రాజకీయ ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ పుల్లంపేట మండల అధ్యక్షులు సిగమాల రమేష్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కాసల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

## సింహాద్రిపురం మండలంలో చెత్త సేకరణ ట్రై సైకిళ్ల పంపిణీ

- ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదాం
- ట్రై సైకిళ్ల పంపిణీలో ఎంపీడీవో పి.శ్రీనివాసరెడ్డి

**సింహాద్రిపురం మన జనప్రగతి మార్చి 17:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలకు చెత్త సేకరణ కొరకు కొత్త ట్రై సైకిళ్లను అందజేశారు. మంగళవారం సింహాద్రిపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం ద్వారా వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడవచ్చని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి తడి,పొడి చెత్తను సేకరించడానికి ప్రభుత్వం ఈ వాహనాలను సమకూర్చిందని,సచివాలయ సిబ్బంది వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి,జెఎస్డబ్ల్యు, అధికారుల,వివిధ పంచాయతీల కార్యదర్శులు మరియు మండల సిబ్బంది పాల్గొన్నారు.వాహనాల పంపిణీ అనంతరం వాటి పనితీరును అధికారులు పరిశీలించారు.



## రైతుల బ్యాంకు ఖాతాలోకి కందులు డబ్బులు జమ చేయాలి

**పత్తికొండ మన జన ప్రగతి మార్చి 17:-** పత్తికొండలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన కందుల ను ప్రభుత్వము రైతుల నుండి జనవరి ఫిబ్రవరి నెలలో మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర ఎనిమిది వేల రూపాయలతో కందులను సచివాల యాల దగ్గర గ్రామాల్లో పట్టడం జరిగింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి 10 రోజుల్లో వేస్తామని ప్రకటన చేసిన నెల దాటినా కూడా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదు కావున వెంటనే రైతుల అకౌంట్లోకి డబ్బులు జమ చేయాలని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేపట్టి ఎమ్మార్వో వినతి పత్రం ఇవ్వడం జరిగింది రైతు సంఘం మండల అధ్యక్షులు కారప్ప అధ్యక్షత వహించగా రైతు సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి సిపిఎం పార్టీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి సిపిఎం నాయకులు దస్తగిరి సిఐటియు కార్యదర్శి ఎం. రవిచంద్ర ప్రజాణాట్యమండలి కాశన్న డివైఎఫ్ఐ నాయకులు దుగ్గెన్న పుచ్చకాయల మాడ రైతు సంఘం నాయకులు ఆదినారాయణ జయ ప్రకాష్ రెడ్డి రైతులు లక్ష్మన్న రాములు కాశన్న పాల్గొన్నారు.



## 27న శ్రీ సీతారాముల శోభాయాత్ర విజయవంతం చేయండి

**- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు**




**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 17:-** శ్రీరామ నవమి ఉత్సవ సమితి అంబర్పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న శ్రీ సీతారాముల వారి శోభాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శోభాయాత్ర కన్వీనర్ డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. శోభాయాత్ర గోల్నాక డివిజన్ కన్వీనర్ ఎం.రమణ అధ్యక్షతన మంగళవారం సుందర్ నగర్, భావసార్ క్షత్రియ భవన్ లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. శోభాయాత్ర అంబర్ పేట మున్సిపల్ మైదానం వద్ద 27న శుక్రవారం మధ్యహ్నం 3గంటలకు ప్రారంభమై కాచిగూడ చౌరస్తా వీరసావర్కర్ విగ్రహం వరకు సాగుతుందని ఆయన తెలిపారు. హిందూ బంధువులు, యువకులు, పార్టీలకతీతంగా శోభాయాత్రలో అందరూ పాల్గొని శ్రీసీతారాముల కృపకు పాత్రులు కాగలరని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కేసరి నర్సింగ్ యాదవ్, డిఆర్ఎస్ నరేంద్ర ఆచారి, ఎస్.శ్రీధర్ గౌడ్, మూల రవీందర్, మల్లికార్జున్, రవి, అజయ్, రాజశేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలు నిర్వహించుకోవాలి: ఏ.ఎస్.పీ మనోజ్ రామనాథ్ హెగ్డే



**రాజంపేట మన జనప్రగతి మార్చి 17:-**మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలు నిర్వహించుకోవాలని రాజంపేట ఏ.ఎస్.పీ మనోజ్ రామనాథ్ హెగ్డే సూచించారు. మంగళవారం రాజంపేట పోలీస్ స్టేషన్ లో మత పెద్దలతో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.ఎస్.పీ మాట్లాడుతూ ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మత సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో పండుగలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచార ఇవ్వాలని పేర్కొన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో సోషల్ మీడియాలలో పోస్టు చేస్తే శాంతి కమిటీ సభ్యులు పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో రాజంపేట ఎస్.ఐ పి. వెంకటేష్, మత పెద్దలు పాల్గొన్నారు.

## ఏక మొత్తంగా ఆస్థి పన్ను చెల్లించి వడ్డీ పై 50 శాతం రాయితీని పొందండి: కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి మన జనప్రగతి మార్చి 17:-** నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి యజమానులు బకాయి ఉన్న ఆస్థి పన్నులను ఒకేసారి చెల్లించి వడ్డీ లో 50శాతం రాయితీ పొందాలని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్తిపన్ను చెల్లింపు పై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ జి.ఓ.యం.యస్. నెం. 58 ఎం.ఏ. & యు.డి. (సి2) డిపార్టుమెంటు, తేది. 16- 03- 2026 న ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ సదవకాశాన్ని ఆస్తిపన్నుదారులు సద్వినియోగం చేయనుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు మార్చి 31 వ తేదీ లోపు ఏక మొత్తంగా ఒకే సారి చెల్లించిన యెడల వాటిపై విధించబడిన వడ్డీనందు 50 శాతం మినహాయింపును పొందవచ్చునని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశం వినియోగించుకొని నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి, 50 శాతం వడ్డీ రాయితీని పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశం మార్చి 31 వ తేదీ వరకు మాత్రమే ఉంటుంది. ఎటువంటి పొడిగింపు ఉండదని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలను కోరారు.

## జల ప్రదాత ముఖ్యమంత్రికి - ఎమ్మెల్యే కాలవ కృతజ్ఞతలు



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 17:-**రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, రాయదుర్గం నియోజకవర్గానికి జల్ జీవన్ మిషన్ వర్తింపజేస్తూ రూ.390కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర సచివాలయంలోని ముఖ్యమంత్రి చాంబర్లో మంగళవారం సాయంత్రం ఆయనను కలుసుకొని రాయదుర్గం నియోజకవర్గ ప్రజల పట్ల సీఎం.చూపుతున్న ప్రేమ, అభిమానం,ఆప్యాయతలకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ వర్తింపజేసిన ఎనిమిది నియోజకవర్గాల్లో వెనుకబడ్డ రాయదుర్గం నియోజకవర్గాన్ని చేర్చడం పట్ల హర్షం వ్యక్తపరిచారు. ఈ పథకంతో నియోజకవర్గ వ్యాప్తంగా 153 గ్రామాల పరిధిలోని 55,726 కుటుంబాలకు మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. 2058 వరకు మూడు దశాబ్దాల పాటు నియోజకవర్గంలో ఏ ఒక్కరికి తాగునీటి సమస్య ఎదురు కాకూడదన్న పెద్ద మనసుతో ఈ పథకాన్ని మంజూరు చేశారని ఆనందం వ్యక్తపరిచారు. ఇంటింటికీ మంచినీరు అందించే మహత్తర కార్యానికి శ్రీకారం చుట్టినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రూ.986కోట్ల విలువైన జీడిపల్లి -బైరవాణితిప్ప ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపినట్లు అవుతుందన్నారు. బలహీనంగా ఉన్న హెచ్ ఎల్ సి ఆధునీకరణ కోసం గత ఏడాది రూ.32 కోట్లు మంజూరు చేయడం ద్వారా సకాలంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించగలిగామని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరై అర్ధాంతరంగా ఆగిపోయిన గుమ్మఘట్ట మండలం గోనబావి బాలికల ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు ఇచ్చి, వెనుకబడిన ప్రాంత ఆడబిడ్డల విద్య పట్ల సీఎం.చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అందిస్తున్న గొప్ప సహకారం రాయదుర్గం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే కాలవ విన్నవించారు.

## ఐదేళ్ల మున్సిపల్ పాలకమండలికి వీడ్కోలు

- **వార్డు ప్రజలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు: 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష**



**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 17 :-** ప్రొద్దుటూరు మున్సిపల్ పాలకమండలి పదవి కాలం ముగిసిన నేపథ్యంలో మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో 13వ వార్డు కౌన్సిలర్ తుఫాన్ భాష భావోద్వేగంగా స్పందించారు తనకు ఈ అవకాశం కల్పించిన 13వ వార్డు ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు గత ఐదేళ్లలో తనతో కలిసి పని చేసిన తోటి కౌన్సిలర్లు మున్సిపల్ సాలరీ సిబ్బంది మీడియా మిత్రులకు అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన తీర్మానాలకు పార్టీలకు అతీతంగా సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు అలాగే తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్ఆర్సిపి నాయకత్వానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాట కొనసాగించే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో ప్రజాసేవ చేస్తూ ప్రొద్దుటూరు అభివృద్ధి విషయంలో రాజు పడకుండా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందు ఉంటానని రెస్పాన్ బాషా పేర్కొన్నారు.

## 4.14 కోట్లు పలికిన ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్: కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి మన జనప్రగతి మార్చి 17:-**నగరపాలక సంస్థ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ కు నిర్వహించిన వేలం పాటలో 4.14 కోట్లకు పలికిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 2026-2027 సంవత్సరానికి మంగళవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రామచంద్ర గుంట కట్టపై ఉన్న పట్నాల్ వీధి కూరగాయల మార్కెట్ కు, జంతు వధశాలకు, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, మాస్కు రోడ్డు, త్యాగరాజ మండపం, దేవేంద్ర థియేటర్ రోడ్డు, కేటి రోడ్డు మార్గముల యందు, హరే రామ హరే కృష్ణ రోడ్డు ఇరువైపులా, కపిల తీర్థం రోడ్డు జంక్షన్ పార్కింగ్, శ్రీనివాసం పక్కన పార్కింగ్ స్థలాలకు, గోవిందరాజ దక్షిణ, ఉత్తర మాడా వీధుల పార్కింగ్ స్థలాల లీజుకు మంగళవారం సీల్డు టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించామని కమిషనర్ తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వేలంలో వై.గీత 4.14 కోట్ల రూపాయల హెచ్చు పాటతో దక్కించుకున్నారు. రామచంద్రగుంట కట్ట పట్నం వీధి కూరగాయల మార్కెట్ ను ముని రాజబాబు 3.30 లక్షల రూపాయల హెచ్చు పాటతో దక్కించుకున్నారు. జంతు వధశాలను వి.గణేష్ 5.85 లక్షలు హెచ్చు పాటతో దక్కించుకున్నారు. గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, మాస్క్ రోడ్డు, త్యాగరాజ మండపము, దేవేంద్ర థియేటర్ రోడ్డు, కె.టి. రోడ్డు, హరే రామ హరే కృష్ణ రోడ్డుకు ఇరువైపులా, కపిల తీర్థం రోడ్డు జంక్షన్ల యందు పార్కింగ్ వసూలు చేయుటకు నిర్వహించిన వేలంలో వి. గణేష్ 50.74 లక్షల రూపాయల హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. శ్రీనివాసన్ పక్కనగల పార్కింగ్ స్థలము లో రుసుము వసూలుకు బాలాజీ 19.11 లక్షల రూపాయల హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గోవిందరాజ ఉత్తర, దక్షిణ మాడ వీధుల్లో పార్కింగ్ రుసుము వసూలుకు రాధ 12.39 లక్షల రూపాయల హెచ్చు పాట పాడి దక్కించుకున్నారని తెలిపారు. వేలం పాటలో హెచ్చు పాట పాడి మార్కెట్, తదితరాలను దక్కించుకున్న వారు నగరపాలక సంస్థ నియమనిబంధనలను తప్పక పాటించాలని కమిషనర్ తెలిపారు. ఈ వేలం పాటలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు భయపడుతున్న ప్రభుత్వం: రాజకీయ విశ్లేషకులు కేవి రమణ



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 17:-** కూటమి ప్రభుత్వం ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి కారణంగా అభద్రతా భావనకు లోనై, ప్రజలకు భయపడుతున్నదని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు కేవి రమణ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవడం, ప్రజల ఆశలను నెరవేర్చలేకపోవడం, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేయడం వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులు ఒకే ప్రాంతానికి పరిమితం కావడం కూడా అసమానతలకు దారి తీస్తోందన్నారు. ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులు అవినీతి, డ్రగ్స్, క్లబ్ వివాదాలు, ఇతర అక్రమ కార్యకలాపాల్లో వరుసగా ఇరుక్కుంటుండటం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటోందని ఆయన అన్నారు. ఈ పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రశ్నించే వారిని అణచివేయడానికి అక్రమ కేసులు, భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తిరుపతిలో జరిగిన ఒక ఘటనను ఉదాహరణగా చూపుతూ..మహిళలు ఆందోళన చేపట్టగా వారిపైనే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. తన కూటమికి చెందిన నేతలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, తమ సామాజిక వర్గానికి చెందిన వారిపై ఉదారత చూపుతూ..ఇతరులపై కఠినంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ విధానం ఆ పార్టీ లోపలే అసంతృప్తికి దారితీస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, అధికారంలో ఉన్న వారు తమ తప్పులను సరిదిద్దుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. లేని పక్షంలో ఇలాంటి ప్రభుత్వాలను ప్రజలు తిరస్కరించే అవకాశం ఉందని కేవి రమణ హెచ్చరించారు.

## ప్రిన్సిపాల్ ధనలక్ష్మికి 'ప్రజాసేవ రత్న' పురస్కారం

- **బాలికల విద్యాభివృద్ధికి చేసిన సేవలకు గౌరవం**
- **జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘన సత్కారం**
- **విద్యార్థినులను ఉన్నత శిఖరాలకు చేర్చే దిశగా అంకితభావం**



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 17:-** బాలికల విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉరవకొండ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మికి 'ప్రజాసేవ రత్న' పురస్కారం లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎస్. హరి ప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ధనలక్ష్మికి దుశ్శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, విద్యార్థినులను సొంత బిడ్డల్లా భావిస్తూ వారికి నాణ్యమైన విద్యను అందించడంలో ధనలక్ష్మి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. బాలికలు ఉన్నత స్థాయికి చేరేలా ఆమె నిరంతరం ప్రోత్సహిస్తున్నారని, ఆమె సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థినులు, వేదిక ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లాలో గ్యాస్ కొరత లేదు..!!: జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా



**కడప మన జనప్రగతి మార్చి 17:-**గ్యాస్ సరఫరాపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మవద్దని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని, జిల్లాలో ఎలాంటి గ్యాస్ కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలు నందు సంభందిత అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి డా. నిధి మీనా మాట్లాడుతూ.. జిల్లాలోని 58 గ్యాస్ ఏజెన్సీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. అలాగే సంభందిత డివిజనల్ అధికారులను పర్యవేక్షణాధికారులుగా నియమించమన్నారు. జిల్లా మరియు డివిజనల్ స్తాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపడుతామని తెలిపారు. జిల్లాలో గృహ అవసరాల వినియోగ గ్యాస్ కొరత ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉండదన్నారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని కేవలం 25/45 రోజులు (పట్టణ/గ్రామీణ వినియోగదారులు) గడువులో మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. గృహ అవసరాలు, సంక్షేమ వసతి గృహాలు మరియు ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో నిలుపుదల ఉండదని స్పష్టం చేశారు. అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రభుత్వం మరియు జిల్లా పాలన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21 ఖస్త్రు) వాణిజ్యఅవసరాల కోసం తరలించిన/ వినియోగించిన అట్టి వారిపై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **సంప్రదించవలసిన అధికారులు...:**జిల్లా స్థాయి (YSR Kadapa District) కలెక్టర్ కంట్రోల్ రూమ్ 08562-246344కడప డివిజన్‌రోహిత్, సీనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో కార్యాలయం 9966225191బద్వేల్ డివిజన్‌ఖాజా, జుణవీ, ఆర్‌డీవో కార్యాలయం 8978089263 జమ్మలమడుగు డివిజన్‌ప్రసన్నకుమార్, కంప్యూటర్ ఆపరేటర్ 9502836762పులివెందుల డివిజన్‌సుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ 9963464408 రాజంపేట డివిజన్‌హరిత, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ 7288840563ఈ సమావేశంలో డిఎస్ఓ రఘురాం, పాత్రికేయులు పాల్గొన్నారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక



# వైసీపీ కౌన్సిల్ పాలనలోనే జరిగిన ప్రొద్దుటూరు అభివృద్ధి

**● మున్సిపల్ చైర్మన్ భీముని పల్లె లక్ష్మీదేవి నాగరాజు**



**ప్రొద్దుటూరు, మన జనప్రగతి మార్చి 17:-** వైసీపీ కౌన్సిల్ పాలనలోనే ప్రొద్దుటూరు అభివృద్ధి సాధ్యమైందని మున్సిపల్ ఛైర్మన్ భీముని పల్లె లక్ష్మీదేవి నాగరాజు తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ముగిసిన అనంతరం ఆమె ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో వున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మున్సిపల్ వైస్ ఛైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ కౌన్సిల్ పదవీ కాలంలో మొదటి మూడు సంవత్సరాల పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం లో వున్న నేపథ్యంలో ప్రొద్దుటూరు లో అన్ని వార్డులలో రోడ్డు, కాల్వల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, 150 కోట్ల రూపాయలతో అమృత్ పథకం, కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రారంభించడంతో పాటు, తాత్కాలిక కూరగాయల మార్కెట్ ఏర్పాటు, మైదుకూరు రోడ్డు ను స్మార్ట్ స్ట్రీట్ గా అభివృద్ధి చేయడం, ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రి వద్ద యర్రగుంట్ల రోడ్డు విస్తరణ, సెంటర్ లైటింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ 2 సంవత్సరాల కాలంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని స్పష్టం చేశారు. తాము అభివృద్ధి చేయాలన్నా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సహకరించడం లేదని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజల సహకారంతో తిరిగి రాష్ట్రంలో వైసీపీ పాలన, ప్రొద్దుటూరు లో మున్సిపల్ కౌన్సిల్ ఇప్పటి లాగే మెజారిటీతో తాము అధికారంలోకి వస్తే ప్రొద్దుటూరు ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. తనకు ఛైర్మన్ పదవి అందించిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కి, సహకరించిన వైసీపీ కౌన్సిలర్లకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేట్ వైద్యాన్ని గిరిజన గడపకు చేర్చిన మంత్రి నారాయణ

**గిరిజన వాడల్లో 'వైద్య యజ్ఞం' - మంత్రి నారాయణ అభయహస్తం**



**నెల్లూరు మన జనప్రగతి మార్చి 17:-**రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అభయహస్తంతో నెల్లూరు సిటీలో నారాయణ నేత్ర జ్యోతి ,దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి .పదోరోజు నగరంలోని 5వ డివిజన్ వైకుంఠపురంలో నారాయణ 'వైద్య యజ్ఞం' కొనసాగింది. 'నారాయణ నేత్ర జ్యోతి' ద్వారా చూపు మందగించిన వందలాది మంది వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అక్కడికక్కడే నాణ్యమైన కంటి అద్దాలను పంపిణీ చేయడమే కాకుండా, కంటి ఆపరేషన్లు అవసరమైన ప్రతి ఒక్కరికీ నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో శస్త్రచికిత్సలను పూర్తి ఉచితంగా చేయిస్తూ మంత్రి నారాయణ తన ఉదారతను చాటుకుంటున్నారు. అదేవిధంగా 'నారాయణ దంత సురక్ష' పేరుతో చిన్నారుల నుండి పెద్దల వరకు దంత సమస్యలతో బాధపడే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య చికిత్సలు అందిస్తున్నారు.నారాయణ మెడికల్ కాలేజ్ వైద్యులు మంత్రి నారాయణ సంకల్పాన్ని ప్రతి ఇంటికీ చేరువ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న గొప్ప ఆలోచనతో మంత్రి తీసుకున్న చొరవపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మాటలకే పరిమితం కాకుండా ప్రజా నాయకుడంటే ఎలా ఉండాలో చేతల్లో చూపిస్తున్న మంత్రి నారాయణ పేద , గిరిజన ,దళిత వాడల్లో నీరాజనాలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యకళాశాల కంటి వైద్యనిపుణులు డాక్టర్ హెప్సిభా ,డాక్టర్ కీర్తికా,దంత వైద్య నిపుణురాలు డాక్టర్ అనూరాధ ,డివిజన్ ప్రెసిడెంట్ గంగాధర్ ,నగర అధ్యక్షుడు మామిడాల మధు ,ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శశి కుమార్, జనరల్ సెక్రటరీ హేమంత్, మరియు యూనిట్ ఇన్‌చార్జ్‌లు షేక్ అబీబ్, దరిసి ప్రసాద్, రోసిరెడ్డి, వెంకటేష్, రంగయ్య,లెక్కల వెంకరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి శాశ్వత త్రాగునీరు లక్ష్యం: ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

**● జల్ జీవన్ మిషన్ పనులకు వేగం ● మహిళలకు సంఘ సముద్రం సందర్శన**



**పీలేరు మన జనప్రగతి మార్చి 17:-** ప్రతి ఇంటికి కులాయి ద్వారా సురక్షితమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు.పీలేరు పట్టణంలోని సచివాలయాల పరిధిలో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రజల సమస్యలను తెలుసుకుని,రహదారులు, విద్యుత్,పారిశుద్ధ్యం,తాగునీటి సమస్యలపై అధికారులకు సూచనలు చేశారు.గతంలో బోరుబావులపై ఆధారపడటంతో వేసవిలో నీటి కొరత ఏర్పడేదని,ప్రస్తుతం గండికోట,వెలుగల్లు ప్రాజెక్టుల ద్వారా పైప్‌లైన్లతో ఇంటింటికి నీరు అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.సుమారు 2 వేల కోట్లతో ఈ పథకం అమలవుతోందన్నారు.గుర్రంకొండ మండలం సంఘ సముద్రం వద్ద త్రాగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు జరుగుతోందని, అక్కడి నుంచి పీలేరు,తంబళ్లపల్లి ప్రాంతాలకు నీరు అందించనున్నట్లు చెప్పారు.జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించి, ప్రతి ఇంటికి రోజుకు 55 లీటర్ల నీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.అలాగే ఈ ప్రాజెక్టుల అమలుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం బ్యాంకులతో చర్చలు కొనసాగుతున్నాయని,త్వరలోనే పనులు మరింత వేగం పుంజుకుంటాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మహిళలకు సంఘ సముద్రం సందర్శన కార్యక్రమం నిర్వహించి,నీటి సరఫరా విధానాన్ని ప్రత్యక్షంగా చూపించనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి హాజరైన మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

**● 108 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు**






**రాయచోటి మన జన ప్రగతి మార్చి 17:-**రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల యాజమాన్యం శ్రీ సాయి విద్యాసంస్థల అధినేత కే పి వి సుబ్బయ్య, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే సాయి నీరజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా నిర్వహించిన జాబ్ మేళాలో డిక్సన్, టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసెస్,ఫాక్స్ కాన్,వేబస్టో రూఫ్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,రాయల్ ఎన్ఫీల్డ్,విట్టర్ ఎలివేటర్ కాంపోనెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని ఎంపిక ప్రక్రియ నిర్వహించాయి.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ మాట్లాడుతూ..మొత్తం 174 మంది విద్యార్థులు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనగా,వారిలో 108 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ. 3 లక్షల నుండి రూ. 4 లక్షల వరకు వేతనం లభిస్తుందని వివరించారు.విద్యార్థులలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు మొదటి సంవత్సరం నుంచే లాజికల్ థింకింగ్, అర్థమెటిక్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని ఆయన చెప్పారు.ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్,విభాగాధిపతులు మరియు అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కె. ఇంతియాజ్,సి.ఎస్.ఇ విభాగాధిపతి పీ. సుబహాన్, మెకానికల్ విభాగాధిపతి పీ. శ్రావణ్, ఏ ఇ డి ఎస్ డాక్టర్ ఏ నరేష్ ,సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర, ఈసీఈ విభాగాధిపతి ఏ.కరుణాకర్,వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# బుడ్డ శనిగ రైతులకు ఇవ్వాల్సింది కొండంత..ఇచ్చింది గోరంత.!



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 17:-**జిల్లాలో బుడ్డ శనిగ రైతులకు ప్రభుత్వం ఇవ్వాల్సింది కొండంత అయితే ఇప్పటివరకు ఇచ్చింది గోరంతని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లె లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ఫిబ్రవరి నెల 19వ తేదీన కడప జిల్లాలో 21 బుడ్డ శనిగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని చెప్పారు. క్వింటాల్ కు రూ 5875 చొప్పున మార్క్ ఫెడ్ ద్వారా ఈ కొనుగోలు కేంద్రాలు రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఇంతవరకు జిల్లాలో 3032 మంది రైతుల వద్ద నుండి,12,630 మెట్రిక్ టన్నుల బుడ్డ శనిగలను కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం శనిగ రైతులకు రూ 74. 2 1 కోట్ల ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు రూ 1.68 కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఒకవైపు వరి ధాన్యం రైతులకు కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటూ ఉందని తెలిపారు. మరి బుడ్డ శనిగ రైతులకు సంబంధించి నెల రోజులు అయినప్పటికి వారి ఖాతాల్లో డబ్బు జమ చేయకపోవడం దురదృష్టకరం. ఆలస్యం చేయకుండా శనిగ రైతుల బ్యాంకు అకౌంట్ డబ్బులు జమ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతున్నప్పటికీ వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లకు సంబంధించి కొత్తగా ఒక్కరికి కూడా ఇవ్వకపోవడం శోచనీయమని తులసిరెడ్డి అన్నారు.కొత్తగా అర్హులైన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు 2026 ఏప్రిల్ మాసం నుంచి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒక్కరికే పెన్షన్ ఇవ్వడం కాకుండా ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్లు కుటుంబ పెన్షన్లు కావని అన్నారు. బిసి,ఎస్సి, ఎస్టి, ముస్లిం మైనారిటీలకు 2026 ఏప్రిల్ నుండి 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలని కోరారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం: టిడిపి క్లస్టర్ ఇన్ ఛార్జ్ మహమ్మద్

**వేంపల్లె మన జనప్రగతి మార్చి 17:-**రైతు సంక్షేమమే కూటమి ధ్యేయంగా పని చేస్తున్నదని టిడిపి క్లస్టర్ ఇన్ ఛార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 7వ సచివాలయం పరిధిలో అన్నదాత సుఖీభవ పథకంకు సంబంధించి రైతుల ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రైతుల అకౌంట్ లోకి రూ 6 వేలు స్వయం వేయడం జరిగిందని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద రైతుల అకౌంట్ లోకి డబ్బులు వేయడంతో రైతులు పంటలకు పెట్టుబడికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడిపి నేతలు ఎద్దుల రాము, ఫయాజ్ (యాంగ్ భాయ్), గండికోటశివ, రమణ, మాజీ ఆర్మీ శివ,ఇస్మాయిల్, ప్రసాద్, భరత్, గంగధర్, రమేష్, , ఇర్ఫాన్ తో పాటు పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు ఫ్రీ బస్సు సౌకర్యం ఒక వరం..

**● దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు వంగి మాల రంగారెడ్డి**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మార్చి 17:-** దివ్యాంగులకు ఫ్రీ బస్సు సౌకర్యం ఒక వరం లాంటిదనిదివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు వంగిమల్ల రంగారెడ్డి అన్నారు.దివ్యాంగుల పై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఒక గెజిట్ పాస్ చేశాడని దివ్యాంగుల పైన చూపిన దయ మరువలేనిదని పింఛను 6000 పెంచిన ఘనత కూడా ముఖ్యమంత్రికి దక్కుతుందని ఆయన అన్నారు.దివ్యాంగులకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ప్రతి దివ్యాంగుడు నేడు హాజరై ఫ్రీ బస్సు పాసు పొందాలని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగిమల్ల రంగారెడ్డి కోరాడు. మంగళవారం ఉదయం రాయచోటి లోని దివ్యాంగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ మార్చి 18వ తేదీన అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల కుటుంబాలకు ఇచ్చిన మాటప్రకారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఆర్ టి సి- డి ఎం, ఆర్ఎంల ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫ్రీ బస్సు పాసులు మంజూరు చేయబడతాయనీ ఈ కార్యక్రమానికి దివ్యంగులందరు హాజరై ఫ్రీ బస్ పాసులను పొందాలని ఆయన తెలిపారు.ఫ్రీ బస్ పాస్ పొందుటకుగాను సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకొని రావాలని రంగారెడ్డి తెలియజేశారు.18వ తేదీన నిర్వహించు సమావేశంలో దివ్యాంగులు ఫ్రీ బస్సు పాస్ పొందుటకు సులభంగా ఉంటుందని, ఈ విషయము తెలియని దివ్యాంగ సోదరులకు సైతం విషయము తెలియజేసి పిలుచుకొని రావలసిందిగా ఆయన ఈ సందర్భంగా తెలిపారు.దివ్యాంగులందరూ ఖచ్చితంగా రాయచోటి బస్టాండ్ దగ్గరికి ఉదయం 11 గంటలకు అవసరమైన ప్రూఫ్స్ తీసుకొనివచ్చి బస్ పాసు పొందాలని రంగారెడ్డి తెలియజేశారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీని అభినందించిన వైవీయూ ఆచార్యులు



**కడప మన జనప్రగతి మార్చి 17:-** యోగి వేమన విశ్వ విద్యాలయంలో గతంలో ఓఎస్డీ గా పనిచేసిన ఆచార్య ఎల్. చిన్న మల్లయ్య ప్రస్తుతం ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతి కావడం ఆహ్వానించదగ్గ విషయం అని అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో ఆచార్యులుగా పనిచేసిన చిన్న మల్లయ్య కడప జిల్లాలోని పోరుమామిళ్ళ ప్రాంత వాసి.ఆచార్య చిన్న మల్లయ్య ఎకనామిక్స్ అధ్యాపకులుగా కేంద్రీయ విశ్వ విద్యాలయం లక్నోలో పనిచేసిన కాలంలో యోగి వేమన విశ్వ విద్యాలయానికి ప్రత్యేక విధి నిర్వహణాధికారిగా ఆయన అందించిన సేవలు గుర్తుంచుకోదగినవిగా కొనియాడారు. వీసీ మల్లయ్య గారిని అభినందించిన వారిలో చరిత్ర శాఖ ఆచార్యులు కె.గంగయ్య, మేనేజ్మెంట్ ఆచార్యులు వై. సుబ్బారాయుడు, తెలుగు శాఖ ఆచార్యులు ఎన్. ఈశ్వర రెడ్డి, భౌతిక శాఖ ఆచార్యులు వి.వెంకట్రామ్, ద్రావిడ విశ్వ విద్యాలయ సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఎన్. రాజేష్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడి సమక్షంలో పాత పేపర్లు వేలం వేసిన గ్రంథాలయ శాఖ అధికారులు



**కాకినాడ మన జనప్రగతి మార్చి 17 :-**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉన్నటువంటి గ్రామీణ గ్రంథాలయాల లో. 2022-23, 2023-24 , 2024-25 సంవత్సరముల వరకు నిల్వ ఉన్న పాత పత్రికలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబా రాజు), కార్యదర్శి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో వివిధ చిన్న మధ్య తరహా పరిశ్రమల నుండి వచ్చిన సీల్డ్ కొటేషన్ టెండర్ దారుల సమక్షంలో ఆక్షన్ నిర్వహించి, వారిలో అధిక రేట్లు నమోదు చేసిన టెండరు దారునికి పాత పేపర్లు విక్రయించడం జరిగిందని గ్రంథాలయ కార్యదర్శి పాలంకి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డూప్యూటీ లైబ్రరియన్ కె. కిషోర్, కార్యాలయ సూపరింటెండెంట్ ఎం. శ్రావ్య, ఎస్. రాజు, సాయి వెంకట్ ఇతర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి..
తెలుగు దినపత్రిక
18 -03-2026

# 'డ్రిప్ ఇరిగేషన్ అమలు'..పంట రాబడి, నాణ్యమైన అభివృద్ధి కోసం ఉత్తమ మార్గం

### సాధారణ రైతులకు 10 ఎకరాల వరకు

### 90 శాతం సబ్సిడీ

### ఎస్సీ,ఎస్టీ రైతులకు 5 ఎకరాల వరకు ఉచితం

### దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలు అందజేస్తాం

### వేముల,వేంపల్లి తోటల్లో డ్రిప్ పద్ధతిని పరిశీలించిన ఏపిడి మురళి మోహన్ రెడ్డి





**వేముల మన జనప్రగతి మార్చి 17:-**కడప జిల్లా రైతులకు అధిక దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం ప్రతి ఎకరాకు డ్రిప్ పరికరాలను అందిస్తోందనీ,రైతులకు సబ్సిడీ ద్వారా ఆటోమేషన్ పరికరాలను కూడా అందిస్తున్నట్లు ఏపీయంఐపి కడప ఏపిడి యం.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఉదయం పులివెందుల నియోజకవర్గంలోని వేముల,వేంపల్లి మండలాల్లో డ్రిప్ పరికరాలు అమర్చిన తోటలను ఆయన పరిశీలించి..రైతులకు పద్ధతిగా డ్రిప్ వాడకం,నీటి వినియోగం తగ్గించడం,విద్యుత్ ఖర్చు ఆదా,భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు.అనంతరం మురళీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ...డ్రిప్ ఇరిగేషన్ ద్వారా 50 శాతం వరకు సాగు నీటిని ఆదా చేయవచ్చు. పంట దిగుబడి 30 శాతం కంటే ఎక్కువ పెరుగుతుందనీ,ఎరువుల ఖర్చులు తగ్గి సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు అన్నారు.భూగర్భ జలాలను పరిరక్షించడం,పంటను ఆరోగ్యంగా ఉంచడం,రైతు ఆదాయం పెరుగుదలలో కీలకంగా ఉందన్నారు.అరటి పంటలో అధిక వర్షాల వల్ల వచ్చే సిగటోగ ఆకు మచ్చ తెగులను నివారించడానికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పీడిత ఆకులను శిలీంధ్ర ద్రావణి, కార్బండిజమ్,మాంకోజెబ్ లేదా షాప్ మినరల్ ఆయిల్ కలిపి తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు.రైతులకు అవసరమున్న ప్రతి చోట ఆటోమేషన్ పరికరాలు అందిస్తున్నామనీ,10 ఎకరాల వరకు సాధారణ రైతులకు 90 శాతం సబ్సిడీ,ఎస్సీ/ఎస్టీ రైతులకు 5 ఎకరాల వరకు ఉచితమని తెలిపారు.డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తే మొత్తం ఖర్చు 40 శాతం వరకు తగ్గుతుంది, నీటి పారుదల కోసం సెలైన్ నీటిని కూడా ఉపయోగించవచ్చు అన్నారు.జుట్టు కావలసిన ప్రతి రైతు కూడా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రల ద్వారా డ్రిప్ మరియు ఆటోమేషన్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.రైతులు డ్రిప్ పద్ధతిని వాడితే,తగ్గిన ఖర్చులు,భూగర్భ జల పరిరక్షణ,ఎరువుల సమర్థవంతమైన వినియోగం,అధిక దిగుబడి వంటి లాభాలను పొందగలుగుతారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా మేఘ కంపెనీ డి సి ఓ చల్లా సునీల్ కుమార్,కంపెనీ ప్రతినిధులు రాజశేఖర్,వివిధ కంపెనీల ప్రతినిధులు,సిబ్బంది,రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వాడి వేడిగా మున్సిపల్ పాలకమండలి చివరి సమావేశం

### అజెండాలోని 5 అంశాలు ఆమోదం

### ఫుడ్ కోర్టు, నగరదీపికలు, 16 వార్డు అభివృద్ధి ఎందుకు చేర్చలేదని ప్రశ్నించిన వైసీపీ

### చైర్‌పర్సన్‌ను అవమానించారంటూ సమావేశం నుండి వెళ్లిన వైసీపీ కౌన్సిలర్



**ప్రొద్దుటూరు,మన జనప్రగతి మార్చి 17 :-** ప్రొద్దుటూరు మున్సిపల్ పాలకమండలి చివరి సాధారణ సమావేశం మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశ భవనంలో మున్సిపల్ ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశం తొలుత 5 అంశాల అజెండా తో ప్రారంభమై వైసిపి కౌన్సిలర్ల అధికారుల మధ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. కాగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ సి.ఎస్. ఖాజామోహిద్దీన్ మున్సిపల్ పార్క్ వద్ద వున్న ఫుడ్ కోర్టు రెన్యువల్ చేయాలని, నగరదీపికలను కొనసాగించాలని, 16వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ అంశాలను అజెండా లో ఛైర్మన్ కోరినా ఎందుకు చేర్చ లేదని ప్రశ్నించారు. కాగా మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, అధికారులు సమాధానమిస్తూ నగరదీపికలను కొనసాగిస్తామని, కానీ మార్చి 31వ తేదీ వరకు గడువు వున్న నేపథ్యంలో అజెండా లో చేర్చలేదని తెలిపారు. 16వ వార్డు అభివృద్ధి కార్యక్రమాలపై వైసీపీ కౌన్సిలర్లు తమ ఛైర్మన్ ను వార్డు ప్రజలు నేరుగా కోరితే ఎందుకు చేర్చలేదని ప్రశ్నించగా అధికారులు సమాధానమిస్తూ ఎస్టిమేషన్ రూపొందించని కారణంగా చేర్చ లేదన్నారు. ఈ నేపథ్యంలో మరో మున్సిపల్ వైస్ ఛైర్మన్ సి.ఎస్. ఖాజామోహిద్దీన్ ఆ అంశానికి సంబంధించి పూర్తయిన ఎస్టిమేషన్ కాపీని చూపించారు. అదేవిధంగా వైస్ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్ మున్సిపల్ ఫుడ్ కోర్టు విషయమై మాట్లాడుతూ ఫుడ్ కోర్టు అంశాన్ని రెన్యువల్ చేయాలని కోరగా కమిషనర్ స్పందిస్తూ మున్సిపల్ చట్టం ప్రకారం గడువు ముగియని అంశాలపై ఏ నిర్ణయం తాను తీసుకోలేనని తెలిపారు. దాదాపు 100 రోజుల పాటు ఇంకా క్యాంటీన్ కు గడువు వుందని, ఇప్పుడు రెన్యువల్ విషయం ప్రస్తావించాల్సిన అవసరం లేదన్నారు. గడువు పూర్తయ్యే సమయానికి నిబంధనల ప్రకారం నిర్ణయిస్తామన్నారు. కాగా సంతృప్తి చెందని వైస్ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్ ఆ ఫుడ్ కోర్టు నిర్వాహకులు అక్కడ పలు రకాల నిర్మాణాలు చేశారని, అక్కడ పని చేసే వారి జీవనం కూడా ఆలోచించాలని సూచించారు. ఈ నేపథ్యంలో మరో కౌన్సిలర్ ఇర్ఫాన్ బాష మాట్లాడుతూ పట్టణంలో సిఎంఆర్ షాపింగ్ మాల్ కు సంబంధించిన హోర్డింగ్ లు ఏర్పాటు చేశారని, వాటికి ఎన్ని రోజుల క్రితం అనుమతించారో, వారు రెన్యువల్ చేసుకున్నారో లేదో తెలపాలన్నారు. ఒక వేళ రెన్యువల్ లేకుండా కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ ఫుడ్ కోర్టు విషయంలో కూడా రెన్యువల్ చేయాలని తెలిపారు. మరో వైస్ ఛైర్మన్ బంగారు రెడ్డి మాట్లాడుతూ డివైడర్లలో వున్న లాలీపాప్ హోర్డింగ్ ల రెన్యువల్ ను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ హోర్డింగ్ లు టౌన్ ప్లానింగ్ అధికారులకు సంబంధించిన విషయమని, సంబంధిత అధికారులు కలెక్టర్ శిక్షణా సదస్సుకు హాజరయ్యారని, వారు రాగానే వాటి గురించి తెలియపరుస్తానని వివరించారు. అదేవిధంగా కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ పార్క్ లో వున్న ఈ ఫుడ్ కోర్టు లో గుడ్డు కుష్కా ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. కాగా వైస్ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్ మాట్లాడుతూ గాంధీ పార్క్, ఫుడ్ కోర్టు వేర్వేరు ప్రాంతాలని, గాంధీ రోడ్డు లో మద్యం, మాంసం దుకాణాలు వున్నాయన్నారు. గాంధీ అహింసా మార్గాన్ని సూచించారని గుర్తు చేశారు. ఫుడ్ కోర్టు లో చికెన్ వండకూడదని తెలిపాక తాము చేయడం లేదన్నారు. కాగా ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు మాట్లాడుతూ ఫుడ్ కోర్టు అంశాన్ని టేబుల్ అజెండా లో చేర్చితే ఆమోదిస్తామని, దీని కోసం సభను అరగంట పాటు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన తర్వాత ఛైర్మన్ అజెండా లోని 5 అంశాలు ఆమోదించడంతో పాటు తాము పేర్కొన్న మరో 3 అంశాలు కూడా మినిట్స్ లో పొందుపరిచి ఆమోదిస్తున్నామని వివరించారు. కాగా కమిషనర్ స్పందిస్తూ అజెండా లో అంశాలు ఛైర్మన్, కౌన్సిల్ ఆమోదించవచ్చుని, లేని అంశాలు ఆమోదం కాదని, అవి మున్సిపల్ చట్టానికి వ్యతిరేకమని తెలిపారు. దీంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు సభ నుండి వెళ్లి పోయారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌కు కఠిన శిక్ష..తమిళనాడు నిందితుడికి 5 ఏళ్ల జైలు

### సిద్దవటం రేంజ్‌లో పట్టుబడిన కేసుపై కోర్టు తుది తీర్పు

### సాక్ష్యాలతో నేరం నిరూపించిన అటవీ శాఖ



**సిద్దవటం మన జనప్రగతి మార్చి 17:-** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడైన తమిళనాడుకు చెందిన అన్నామలై పలని స్వామికి తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టు సోమవారం కీలక తీర్పు వెల్లడించింది. నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.వివరాల్లోకి వెళితే, 2017 సంవత్సరంలో కడప జిల్లా సిద్దవటం రేంజ్ పరిధిలోని సిద్దవటం బీట్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అన్నామలై పలని స్వామి అటవీ శాఖ సిబ్బందికి పట్టుబడ్డారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి సుదీర్ఘ విచారణ కొనసాగించారు.సమగ్ర సాక్ష్యాధారాల ఆధారంగా నేరం నిరూపితం కావడంతో కోర్టు తుది తీర్పు వెలువరించింది.ఈ సందర్భంగా సిద్దవటం ఎఫ్.ఆర్.ఓ కళావతి మాట్లాడుతూ..నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో అటవీ శాఖ సిబ్బంది సాక్ష్యాధారాలను సమగ్రంగా సేకరించి విశేషంగా కృషి చేశారని తెలిపారు. అటవీ సంపద రక్షణలో ఎలాంటి రాజీ ఉండదని ఆమె స్పష్టం చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు చీరెల పంపిణీ



**పోరుమామిళ్ల మన జనప్రగతి మార్చి 17:-**పవిత్ర రంజాన్ పర్వదినాల సందర్భంగా పట్టణంలోని ముస్లింకోట వీధిలో తెలుగుదేశం పార్టీ నాయకుడు దర్వేష్ సతీమణి, 9వ వార్డు సభ్యురాలు ఎస్.ఎం. సంధాని పారిశుద్ధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికుల సేవలను అభినందించిన సంధాని, సమాజానికి వారు చేస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు.రంజాన్ పండుగను మండలంలోని ముస్లిం సోదరులు, సోదరీమణులు ఆనందంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.అల్లా దయ,కరుణ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తూ,సర్వ మానవాళికి శాంతి,సౌభ్రాతృత్వం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన పులివెందుల మున్సిపల్ కౌన్సిల్ ఐదేళ్ల ప్రస్థానం

### పులివెందులను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు బ్రేక్

### ప్రజలకు,సిబ్బందికి ఛైర్మన్ వరప్రసాద్ భావోద్వేగ కృతజ్ఞతలు







**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 17:** పులివెందుల మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం మంగళవారం తో ముగియనున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో చివరి సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ వరప్రసాద్ బాధ్యతల నుండి వైదొలుగుతూ తన ఐదేళ్ల అభివృద్ధి ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.సమావేశం ప్రారంభానికి ముందు మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి,ఛైర్మన్ వరప్రసాద్ మరియు కౌన్సిలర్లు కలిసి కార్యాలయంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరియు మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జరిగిన సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.తమకు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన వైఎస్సార్ కుటుంబానికి ఈ సందర్భంగా కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఛైర్మన్ వరప్రసాద్ భావోద్వేగంతో మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రోజు నుండి నేటి వరకు పులివెందుల పట్టణ ప్రజలు నాపై చూపిన నమ్మకం, మద్దతు వెలకట్టలేనివి అని ఈ ఐదేళ్ల కాలంలో పట్టణ అభివృద్ధి కోసం చేసిన ప్రతి ప్రయత్నంలోనూ ప్రజల ప్రోత్సాహం మరువలేనిది అని పేర్కొన్నారు.అభివృద్ధి పనుల్లో అంకితభావంతో పనిచేసిన సచివాలయం సిబ్బందికి,ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వాలంటీర్లకు మరియు పారిశుధ్య కార్మికులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ మున్సిపల్ సిబ్బంది వెనకడుగు వేయకుండా ఐసోలేషన్ సెంటర్లు,మందులు,ఆహారం పంపిణీ చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడారని ఆయన కొనియాడారు.పటిష్టమైన శానిటేషన్ వ్యవస్థ కారణంగా పులివెందులకు 2022లో 'బెస్ట్ ఇన్నోవేషన్ 2023లో 'క్లీన్ సిటీ' వంటి జాతీయ స్థాయి అవార్డులు రావడం మనందరికీ గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.అదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పులివెందుల అభివృద్ధిపై చూపుతున్న వివక్షను ఆయన తీవ్రంగా ఖండించారు.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పులివెందులను ఒక స్మార్ట్ సిటీని తలదన్నేలా 'మోడల్ టౌన్'గా తీర్చిదిద్దారని వరప్రసాద్ పేర్కొన్నారు. విశాలమైన రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఆహ్లాదకరమైన పార్కులు,చెరువుల అభివృద్ధి, అత్యాధునిక లైటింగ్ వ్యవస్థతో పట్టణాన్ని సుందరీకరించినట్లు తెలిపారు.ముఖ్యంగా విమానాశ్రయం తరహాలో నిర్మించిన ఆర్టీసీ బస్ స్టాండ్ పులివెందులకే గర్వకారణమని కొనియాడారు. **పనులు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం** రాష్ట్రంలో ప్రభుత్వం మారాక పులివెందులపై సీతకన్ను పడిందని వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.దాదాపు పూర్తి కావాల్సిన సిటిజన్ సర్వీస్ సెంటర్,మినీ సచివాలయం వంటి భవనాలను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. మున్సిపాలిటీకి నెలకు 30 లక్షల ఆదాయం వచ్చేలా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయని, దీనివల్ల మున్సిపాలిటీకి ఆదాయ గండి పడుతోందని అన్నారు.కూటమి ప్రభుత్వం వైఖరి వల్ల పులివెందుల అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.పదవులు,కుర్చీలు ఎప్పుడూ శాశ్వతం కావని ప్రజల గుండెల్లో నిలిచిపోయే పనులే శాశ్వతమని వరప్రసాద్ స్పష్టం చేశారు.వైఎస్సార్ మరియు జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా,ఎంపీ అవినాష్ రెడ్డి సహకారంతో పులివెందుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామని,ఈ ప్రస్థానంలో తోడున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.తమ కౌన్సిల్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మున్సిపల్ కార్యాలయంలో పారదర్శకత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని,కొత్త భవనం ద్వారా ఆధునిక సేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.అనధికారిక కుళాయి కనెక్షన్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి,పన్నుల వసూళ్లను పెంచి మున్సిపల్ ఆదాయాన్ని గణనీయంగా పెంచినట్లు వివరించారు.తన పదవీకాలం ముగిసినప్పటికీ,పులివెందుల ప్రజల పట్ల నాకున్న నిబద్ధత ఎప్పటికీ కొనసాగుతుంది.బాధ్యతల్లో ఉన్నా లేకపోయినా,పట్టణ ప్రజలకు ఏ అవసరం వచ్చినా నాకు చేతనైన రీతిలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని స్పష్టం చేశారు.అనంతరం కౌన్సిల్ సభ్యులను మున్సిపల్ అధికారులు,సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174